APTEL/26/A4813



# శ్రీ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

కొత్త ఆలోచన.. కొత్త వార్త




సంపుటి : 01 సంచిక :71 ఎడిటర్.: కూరేటి సతీష్ పేజిలు : 08, వెల రూ. 2రూ/ శుక్రవారం - 18 - సెప్టెంబర్ - 2026

Published From : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad



## రాజకీయాల్లో హుందాతనానికి ప్రతీక నాని.. మంత్రి లోకేశ్ భావోద్వేగ నివాళి

- గుండెపోటుతో మరణించిన ఆళ్ల నానికి మంత్రి లోకేశ్ నివాళి
- రాజకీయాల్లో నాని హుందాగా వ్యవహరించారని కొనియాడిన లోకేశ్
- వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా సమస్యలపైనే పోరాడారన్న మంత్రి మిగతా 2 లో

## తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు.. ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల




- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల
- మహబూబ్‌నగర్, వరంగల్ నియోజకవర్గాలకు ఎన్నికల ప్రక్రియ
- సెప్టెంబర్ 20 నుంచి నవంబర్ 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- పాత ఓటర్లు కూడా మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవాలని స్పష్టం
- డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటన

హైదరాబాద్: తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను మిగతా 2 లో



## రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం

- రాష్ట్రంలో కరవు పరిస్థితులపై జగన్ ఆందోళన
- ఈ ఖరీఫ్‌లో సాగు 56.4 లక్షల ఎకరాలకే పరిమితమయిందన్న జగన్
- రైతులను నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న

## పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు జగన్ పై అనిత ఫైర్



- డీఎస్సీ నియామకాలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని అనిత మండిపాటు
- డీఎస్సీ పూర్తయిన ఏడాది తర్వాత బురద చల్లుతున్నారని ఆగ్రహం
- వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలుసని వ్యాఖ్య

# కాశీలో బాలాజీ ఆలయానికి 10 ఎకరాలు కేటాయించాలి

## వారణాసిలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో చంద్రబాబు

**వారణాసిలో చంద్రబాబు వాగ్ధాటి..**

'VKS' మంత్రంతో సభికులను అలరించిన ఏపీ సీఎం

- మోదీ పాలనను వివరిస్తూ 'VKS' మంత్రాన్ని ఆవిష్కరించిన సీఎం
- చంద్రబాబు ప్రసంగానికి రాజ్‌నాథ్ సింగ్ ప్రత్యేక అభినందనలు
- ఎన్డీఏ బంధం చెక్కుచెదరదని, ఏపీకి అండగా నిలిచారని స్పష్టీకరణ



అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా వారణాసిలో నిర్వహించిన 'కాశీ-వాద్‌నగర్ సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సభలో ఆయన తన వాగ్ధాటితో మిగతా 2 లో



## కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

- కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై ప్రభుత్వం చర్యలు
- సమీపంలోని ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారుల ఆరా

## మోదీ ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్.. ప్రధాని వాడిన ఆ పదాల అర్థమేంటో తెలుసా?

### ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్ వాడుతున్న ప్రధాని మోదీ

- యువతకు చేరువయ్యేందుకు కొత్త కమ్యూనికేషన్ వ్యూహం
- 'ఫ్లెక్స్', 'ఫోమో', 'ఓజీ' వంటి పదాల వినియోగం
- ఎస్ఆర్‌సీసీ, ఇండియా-డెన్మార్క్ సదస్సుల్లో ఈ పదాల ప్రస్తావన
- యువ ఓటర్లను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా విశ్లేషణ



ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగ శైలిలో మార్పులు చేస్తూ, యువతకు మరింత చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా, నేటి తరం మిగతా 2 లో

## చైనా నుంచి బయటకు వెళ్లడం ఇక అంత ఈజీ కాదు.. కొత్త రూల్స్‌తో షాక్!

### చైనాలో కొత్త నిష్క్రమణ ఆంక్షలు అమల్లోకి

- పౌరులు, విదేశీయుల ప్రయాణంపై అధికారులకు విస్తృత అధికారాలు
- జాతీయ భద్రత పేరుతో ఆంక్షలు విధించే అవకాశం
- నిబంధనలపై హెచ్‌ఆర్‌డబ్ల్యూ తీవ్ర ఆందోళన
- విదేశీయులపైనా గతంలో ఆంక్షలు విధించిన ఉదాహరణలు



ఢిల్లీ: చైనా ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశ పౌరులతో పాటు విదేశీయులు చైనా నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకునే అధికారం అధికారులకు ఈ నిబంధనలు కల్పిస్తున్నాయని హ్యూమన్ రైట్స్ వాచ్ మిగతా 2 లో

# తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందాం

## తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందాం

- ★ సెప్టెంబర్ 17వ తేదీ మన బాధ్యతను కూడా గుర్తు చేసే రోజు
- ★ ఈ చారిత్రక నేపథ్యం, ఉద్యమాల ఫలాలు ప్రజల జీవితాల్లో కనిపించాలి
- ★ రైతుకు భరోసా ఉండాలి. మహిళలు ఆర్థికంగా ఎదగాలి. అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలి



హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అభివృద్ధి చేరడానికి నాలుగు కోట్ల ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందామని అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు మాట్లాడారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అభివృద్ధి అన్ని ప్రాంతాలకు చేరాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మిగతా 2 లో



## 2004 అఫిడవిట్‌లో ఒక్క ఎకరం లేదు.. కేసీఆర్ భూములపై పొంగులేటి సంచలన ప్రశ్నలు

- 2004 అఫిడవిట్‌లో కేసీఆర్‌కు భూమి లేదన్న పొంగులేటి
- ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని ప్రశ్న
- కేసీఆర్ భూస్వామ్య కుటుంబంలో పుట్టారన్న బీఆర్ఎస్ వాదనపై కౌంటర్

## కేసీఆర్, కుటుంబ ఆస్తులపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన కేటీఆర్



- కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందనడంపై కేటీఆర్ ఆగ్రహం
- మాజీ సీఎంకు ఉన్నది 67 ఎకరాలేనని స్పష్టం
- పుట్టుక నుంచి తమ ఆస్తులపై విచారణకు సిద్ధమని ప్రకటన
- మీ ఆస్తులపైనా విచారణకు సిద్ధమా అంటూ రేవంత్‌కు సవాల్
- సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్

## రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం
## కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లాల వారీగా పరిస్థితులపై సమీక్ష జరిపారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడుతూ ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసీపీ క్షేత్రస్థాయి కార్యాచరణ చేపడుతుందని, త్వరలోనే తాను స్వయంగా కరవు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

## చైనా నుంచి బయటకు వెళ్లడం ఇక అంత ఈజీ కాదు..

ఢిల్లీ: చైనా ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశ పౌరులతో పాటు విదేశీయులు చైనా నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకునే అధికారం అధికారులకు ఈ నిబంధనలు కల్పిస్తున్నాయని హ్యూమన్ రైట్స్ వాచ్ (హెచ్‌ఆర్‌డబ్ల్యూ) తెలిపింది. ఈ నిర్ణయం అంతర్జాతీయంగా గుర్తించిన దేశాన్ని విడిచి వెళ్లే హక్కుకు విరుద్ధంగా ఉందని పేర్కొంది. సెప్టెంబరు 15 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. జాతీయ భద్రత, ప్రమాదాల పేరుతో, స్పష్టత లేని కారణాలతో ప్రయాణాన్ని అడ్డుకునే అవకాశం అధికారులకు కల్పించారని హెచ్‌ఆర్‌డబ్ల్యూ ఆరోపించింది. దేశం విడిచి వెళ్లడంపై ఆంక్షలు విధించాలంటే అవి అవసరమైనవి, సముచితమైనవిగా ఉండాలని అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలు చెబుతున్నాయని సంస్థ పేర్కొంది. హెచ్‌ఆర్‌డబ్ల్యూ ఆసియా విభాగం డిప్యూటీ డైరెక్టర్ మాయా వాంగ్ ఈ నిర్ణయంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరిని దేశం నుంచి బయటకు వెళ్లనివ్వాలి? ఎవరిని అడ్డుకోవాలి? అన్నది అధికారులు తమ ఇష్టానుసారం నిర్ణయించే పరిస్థితి ఏర్పడుతోందని ఆమె అన్నారు. మానవ హక్కుల కార్యకర్తలు, కొన్ని మైనారిటీ వర్గాల అంతర్జాతీయ ప్రయాణాలపై ఇప్పటికే చైనా అధికారులు నిఘా, ఆంక్షలు పెంచారని తెలిపారు. విదేశీయులపైనా ఇదే పరిస్థితి ఉండొచ్చని హెచ్‌ఆర్‌డబ్ల్యూ హెచ్చరించింది. 2025 జులైలో ఓ అమెరికా ప్రభుత్వ ఉద్యోగి, వెల్స్ ఫార్గో బ్యాంక్ అధికారి చైనా నుంచి బయటకు వెళ్లకుండా అధికారులు అడ్డుకున్నారని పేర్కొంది. వారిపై ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు కాలేదని తెలిపింది. చైనా గత దశాబ్దంలో దేశం విడిచి వెళ్లే విషయంలో ఆంక్షలను క్రమంగా పెంచిందని హెచ్‌ఆర్‌డబ్ల్యూ పేర్కొంది. ముఖ్యంగా మతపరమైన మైనారిటీలు, మానవ హక్కుల కార్యకర్తలపై ప్రయాణ పరిమితులు పెరిగాయని తెలిపింది. 2016లో జిన్‌జియాంగ్ అధికారులు గతంలో జారీ చేసిన పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్న తర్వాత మైనారిటీ ఉయ్‌గర్ ముస్లింల విదేశీ ప్రయాణంపై ఆంక్షలు మరింత తీవ్రమయ్యాయని చెప్పింది. కొత్త నిబంధనలు భావ వ్యక్తీకరణ, విద్యా స్వేచ్ఛపై కూడా ప్రభావం చూపొచ్చని హెచ్‌ఆర్‌డబ్ల్యూ ఆందోళన వ్యక్తం చేసింది. దేశం విడిచి వెళ్లకుండా అడ్డుకుంటారనే భయంతో చైనా పౌరులు, విదేశీయులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడంలో వెనుకడుగు వేసే అవకాశం ఉందని పేర్కొంది.

### కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి..
## రంగంలోకి రెవెన్యూ అధికారులు

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఫామ్‌హౌస్ భూములపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఫామ్‌హౌస్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల సర్వే నంబర్లు, గతంలో ఆ భూములను సాగు చేసిన రైతుల పేర్లు, ప్రస్తుత భూ రికార్డుల వివరాలతో అధికారులు సమగ్ర నివేదికలను రూపొందిస్తున్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటనకు అనుగుణంగానే అధికారులు ఇప్పుడు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రం వద్ద ప్రభుత్వ భూమిపై దృష్టి పెట్టారు. కేసీఆర్ భూముల విస్తీర్ణం, వాటి స్వరూపంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

### తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు..
## ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల

హైదరాబాద్: తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానాలకు ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 20న ఓటర్ల నమోదుకు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీ చేయనున్నారు. అప్పటి నుంచి నవంబర్ 6 వరకు అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు గడువు ఉంటుంది. వీటిని పరిష్కరించిన అనంతరం, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఒక కీలక విషయాన్ని స్పష్టం చేశారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా పేరు నమోదు చేసుకున్న వారు కూడా తప్పనిసరిగా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాత ఓటు రద్దవుతుందని, కొత్త జాబితాలో పేరు ఉంటేనే ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ఈ రెండు స్థానాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీలు వాణీదేవి, తీన్మార్ మల్లన్న పదవీకాలం వచ్చే ఏడాది మార్చి నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియను ప్రారంభించింది.

### 2004 అఫిడవిట్‌లో ఒక్క ఎకరం లేదు..
## కేసీఆర్ భూములపై పొంగులేటి సంచలన ప్రశ్నలు

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భూముల వ్యవహారంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2004 కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్‌లో తనకు ఒక్క ఎకరం భూమి కూడా లేదని కేసీఆర్ పేర్కొన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల భూస్వామ్య కుటుంబంలో జన్మించారంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలకు ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ స్వయంగా సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌ను గతంలో ఎక్స్‌లో పంచుకున్న పొంగులేటి.. తెలంగాణ ఉద్యమ కాలంలో, ఆ తర్వాత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆయన ఆస్తులు భారీగా పెరిగాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల అఫిడవిట్లే స్పష్టం చేస్తున్నాయని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్న సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు అప్పులు మిగిలితే.. కేసీఆర్ కుటుంబానికి మాత్రం లక్షల కోట్ల విలువైన ఆస్తులు ఎలా వచ్చాయని పొంగులేటి ప్రశ్నించారు. ప్రభుత్వ భూములు, పేదలు, దళితులకు చెందిన అసైన్డ్ భూములను దోచుకోవడం వల్లే ఈ ఆస్తులు వచ్చాయని ఆయన ఆరోపించారు. కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల ఆసామి అని కేటీఆర్ చెబుతున్నారని, మరి 2004 ఎన్నికల అఫిడవిట్‌లో ఆ వివరాలు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఎన్నికల అఫిడవిట్‌లో తప్పులు రాశారా? లేక ప్రజలకు తప్పుడు సమాచారం చెబుతున్నారా? అని కేటీఆర్‌ను పొంగులేటి నిలదీశారు.

### మోదీ ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్..
## ప్రధాని వాడిన ఆ పదాల అర్థమేంటో తెలుసా?

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగ శైలిలో మార్పులు చేస్తూ, యువతకు మరింత చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా, నేటి తరం యువత (జెన్-జీ) ఎక్కువగా వాడే ఆధునిక పరిభాషను, స్లాంగ్ పదాలను తన ప్రసంగాల్లో ఉపయోగిస్తూ అందరినీ ఆకర్షిస్తున్నారు. ఆయన ప్రసంగాల్లో ఈ కొత్త పదజాలం వాడటం వెనుక, యువ ఓటర్లను ఆకట్టుకోవాలనే స్పష్టమైన వ్యూహం కనిపిస్తోంది. ఇటీవల ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ కళాశాల పూర్వ విద్యార్థులను ‘ఓజీ’ లుగా అభివర్ణించారు. జెన్-జీ పరిభాషలో ‘ఓజీ’ అంటే ‘ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్’ అని అర్థం. అంటే తమ రంగంలో అత్యంత ప్రావీణ్యం ఉన్నవారిని, ప్రత్యేకమైన వారిని గౌరవంగా ఇలా పిలుస్తారు. ఇదే ప్రసంగంలో ‘ఫ్లెక్స్’ అనే పదాన్ని కూడా ఆయన వాడారు. “ఈ రోజుల్లో కూడా ఢిల్లీ యూనివర్సిటీలో మీరు ఎస్ఆర్‌సీసీ విద్యార్థి అని చెప్పుకోవడం ఒక ‘ఫ్లెక్స్’ లాంటిది” అని ఆయన వ్యాఖ్యానించారు. తమకున్న హోదాను, నైపుణ్యాన్ని లేదా విజయాన్ని గర్వంగా ప్రదర్శించడాన్ని ‘ఫ్లెక్స్’ అంటారు. ఇంతకుముందు 2022లో డెన్మార్క్ ప్రధానితో కలిసి ఇండియా-డెన్మార్క్ బిజినెస్ ఫోరమ్‌లో ప్రసంగిస్తూ ప్రధాని ‘ఫోమో’ (ఫ్డీమో) అనే పదాన్ని ప్రస్తావించారు. ‘ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్’ అనే పదబంధానికి సంక్షిప్త రూపమే ఈ ‘ఫోమో’. సోషల్ మీడియాలో ఈ పదం చాలా ప్రాచుర్యం పొందింది. భారత్‌లో పెట్టుబడులు పెట్టని వారు గొప్ప అవకాశాన్ని కోల్పోతారని, వారు ‘ఫోమో’కు గురవుతారని చెప్పడానికి మోదీ ఈ పదాన్ని చమత్కారంగా ఉపయోగించారు. ప్రధాని మోదీ ఈ తరహా పదాలను ఉపయోగించడం ఒక విస్తృత కమ్యూనికేషన్ వ్యూహంలో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు. సోషల్ మీడియా, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ తరహా కంటెంట్‌తో యువతను ఆకట్టుకోవడం దీని ప్రధాన ఉద్దేశం. సంప్రదాయ రాజకీయ ప్రసంగాలకు భిన్నంగా, మారుతున్న కాలానికి అనుగుణంగా తనను తాను మలచుకుంటూ యువతరంతో మమేకం అయ్యేందుకు మోదీ చేస్తున్న ఈ ప్రయత్నం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

# తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందాం

మొదటి పేజి తరువాయి

తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందామని అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు మాట్లాడారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అభివృద్ధి అన్ని ప్రాంతాలకు చేరాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా 4 కోట్ల తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులకు ఈ చారిత్రక సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. “అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం మా ప్రజా పాలనకు పునాదులు. సెప్టెంబర్ 17వ తేదీ మన బాధ్యతను కూడా గుర్తు చేసే రోజు. ఈ చారిత్రక నేపథ్యం, ఉద్యమాల ఫలాలు ప్రజల జీవితాల్లో కనిపించాలి. రైతుకు భరోసా ఉండాలి. మహిళలు ఆర్థికంగా ఎదగాలి. అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలి. పేద బిడ్డకు మంచి చదువు, మంచి వైద్యం అందాలి. యువతకు ప్రపంచంతో పోటీ పడే అవకాశాలు రావాలి. తరతరాల అణిచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ. నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్పటికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలించింది. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం అధికారికంగా భారతదేశంలో అంతర్భాగమైంది. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భం. అందుకే సెప్టెంబర్ 17ను మనం “ప్రజా పాలన దినోత్సవం”గా జరుపుకుంటున్నాం. ప్రజా పాలన అంటే ప్రజల మాటకు విలువ ఇవ్వడం... వారి సమస్యలకు పరిష్కారం చూపడం. వారి హక్కులను కాపాడడం. ప్రభుత్వ వనరులు అందరికీ చేరేలా చూడడం. అదే స్ఫూర్తితో ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజా పాలన కొనసాగిస్తున్నాం. తెలంగాణ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలతో కాదు, ప్రపంచంతో పోటీ పడుతోంది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931కు చేరింది. ఇది దేశ తలసరి ఆదాయం కన్నా దాదాపు 91 శాతం అధికం. అభివృద్ధి అంకెల్లో మాత్రమే కాకుండా ప్రజల జీవితాల్లో కనిపించాలన్నదే మా లక్ష్యం. ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతి. ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేశాం. రూ.20,616 కోట్లు విడుదల చేసి 25.35 లక్షల రైతు కుటుంబాలను అప్పుల ఊబి నుంచి బయటపడేశాం. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేశాం.

సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాం. ప్రభుత్వం ఇచ్చిన మద్దతుతో వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలిచింది. 32 నెలల్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు రూ.1 లక్ష 72 వేల కోట్లు ఖర్చు చేశాం. భూ భారతి చట్టం ద్వారా భూ పరిపాలనలో సమగ్ర సంస్కరణలు తీసుకొచ్చాం. భూధార్, ఏఐ ఆధారిత భూమిత్ర సేవలు ప్రారంభించాం. 5 లక్షల 94 వేల మంది రైతులకు పట్టాదార్ పాస్‌బుక్‌లు జారీ చేశాం. కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటా కోసం న్యాయపోరాటం చేస్తున్నాం. పాలమూరు--రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతలు, ఎస్ఎల్‌బీసీతో పాటు ఇతర పెండింగ్ ప్రాజెక్టుల పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నాం. తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ సగర్వంగా జీవించాలి. ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలి. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మా ప్రభుత్వం పనిచేస్తోంది. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. ఈ ప్రయాణాలతో మన ఆడబిడ్డలకు రూ.12,385 కోట్ల మేర ఖర్చు ఆదా అయింది. గృహజ్యోతి కింద 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. 43 లక్షల కుటుంబాలకు రూ. 500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా 1 లక్ష 68 వేల మంది ఆడబిడ్డలకు రూ. 4,709 కోట్ల సహాయం చేశాం. 4.54 లక్షల స్వయం సహాయక సంఘాలకు రూ.60 వేల 487 కోట్ల బ్యాంకు లింకేజీ, రూ. 1,900 కోట్ల వడ్డీ రాయితీ కల్పించాం. మహిళా మార్టులు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులతో మహిళల ఆదాయం పెంచుతున్నాం. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 3.42 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నాం. 15 లక్షలకు పైగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశాం. 43 లక్షలకు పైగా మందికి సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తున్నాం. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల కింద సుమారు రూ. 31 వేల కోట్లు అందించాం. తాజాగా మరో 2.25 లక్షల మందికి పింఛన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో నివసించాలనేది మా ప్రభుత్వ ఆశయం. ఇందిరమ్మ ఇళ్ల తొలి దశలో రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. ఒక్కో ఇంటికి రూ. 5 లక్షలు అందించాం. రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. హైదరాబాద్ నగర పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ టవర్ల నిర్మాణాన్ని ప్రారంభించాం. సామాజిక అంతరాలను తగ్గించి ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనే లక్ష్యంతో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేను శాస్త్రీయంగా చేపట్టాం. ఆ సర్వే గణాంకాల ఆధారంగా విద్య, ఉపాధి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభలో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపించాం. గౌరవ సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాం. ఫిబ్రవరి 4ను ప్రతి ఏటా “తెలంగాణ సోషల్ జస్టిస్ డే” గా జరుపుకుంటున్నాం. సామాజిక న్యాయం అంటే మాకు నినాదం కాదు. వెనుకబడిన వారిని ముందుకు తీసుకురావడం. ప్రజా ప్రభుత్వానికి విద్య, వైద్యం రెండు కళ్లలాంటివి. కుల, మత భేదాలు లేకుండా పిల్లలందరికీ నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తున్నాం.

ఒక్కో నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో సకల వసతులతో వీటి నిర్మాణం చేపడుతున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించాం. ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించేందుకు రూ. 927 కోట్లు ఖర్చు చేస్తున్నాం. మధ్యాహ్న భోజనాన్ని 12వ తరగతి విద్యార్థుల వరకు విస్తరించాం. 11 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నాం. విద్యా రంగంలో తీసుకున్న చర్యలతో పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరుకుంది. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. అమెరికాకు చెందిన నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీతో పాటు బ్రిటన్‌లోని 17 స్వతంత్ర విద్యా సంస్థల సమాఖ్య యూనివర్సిటీ ఆఫ్ లండన్ తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌ల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశాయి. ఆరోగ్య రంగానికీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5 లక్షల 19 వేల మందికి రూ.2,526 కోట్ల సహాయం అందించాం. సామాన్యుడికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం మొదలైంది. సనత్‌నగర్‌లో మర్రి చెన్నారెడ్డి టిమ్స్ సూపర్? స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించుకున్నాం. అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం. వరంగల్‌లో 2 వేల పడకలతో టిమ్స్ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొస్తాం. తెలంగాణ ఉద్యమంలో యువత ముందుండి పోరాడింది. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కోసం పోరాడింది. 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పారదర్శకంగా పూర్తి చేశాం. గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాం. ఏఐతో ఉద్యోగాల స్వరూపం మారుతోంది. కొత్త నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. అందుకే నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసుకున్నాం. ఏటీసీలో శిక్షణ పొందిన విద్యార్థులు ఈరోజు క్యాంపస్? ప్లేస్?మెంట్స్ సాధిస్తున్నారు. పాలిటెక్నిక్ కాలేజీల్లోనూ కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నాం. మన యువత ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఎదగాలి. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను కూడా వేగంగా విస్తరిస్తున్నాం. రూ. 38,595 కోట్లతో 122.9 కిలోమీటర్ల మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు పంపించాం. ఆదిలాబాద్, మామునూరు విమానాశ్రయాలకు అనుమతులు సాధించాం. అవసరమైన భూసేకరణ చేపట్టాం. హైదరాబాద్ ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాలనే లక్ష్యంతో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు ప్రారంభించాం. 55 కిలోమీటర్ల పరిధిలో మూసీని పునరుజ్జీవింపజేస్తాం.

ప్రజల ఆరోగ్యంతో ఆడుకునే ఆహార కల్తీని ఎట్టి పరిస్థితుల్లో సహించం. అందుకే టీజీ సేఫ్ ఏర్పాటు చేసి కఠినంగా వ్యవహరిస్తున్నాం. యువత పెడదోవ పట్టకుండా రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు ఈగల్ వ్యవస్థను పటిష్ఠం చేశాం. ఈ రోజు అవసరాలు తీర్చడమే కాదు. మా లక్ష్యం రేపటి తెలంగాణను నిర్మించడం. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలను సాధించేందుకు ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనేది మా సంకల్పం. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే దిశగా అడుగులు వేస్తున్నాం. దాదాపు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని దేశంలో తొలి నెట్-జీరో స్మార్ట్ సిటీ నిర్మిస్తున్నాం. డిసెంబర్‌లో నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 సందర్భంగా ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తాం. ఫ్యూచర్ సిటీలో టీసీఎస్ రూ.70 వేల కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ నిర్మించేందుకు ముందుకు వచ్చింది. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో అమెజాన్ ఇప్పటికే డేటా సెంటర్ నిర్మాణం చేపట్టింది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, లైఫ్ సైన్సెస్ హబ్, ఈవీ పార్క్, ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఎడ్యుకేషన్ సిటీ వంటి ప్రత్యేక జోన్లతో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నాం. రీజినల్ రింగ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, డ్రైపోర్టులు, హైదరాబాద్--నాగపూర్, హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్--విజయవాడ పారిశ్రామిక కారిడార్లు తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చనున్నాయి. రహదారులు అభివృద్ధికి సూచిక. గ్రామం నుంచి మండలానికి, మండలం నుంచి జిల్లాకు, జిల్లా నుంచి రాష్ట్ర రాజధానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించేందుకు పనులు చేపట్టాం. ఆర్ అండ్ బీ పరిధిలో రూ.13 వేల కోట్లతో, పంచాయతీరాజ్ పరిధిలో రూ. 6,294 కోట్లతో రహదారి పనులు చేపడుతున్నాం. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. విద్యుత్ డిమాండ్ కూడా పెరిగింది. తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తున్నాం. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజల నుంచి కూడా సహకారం ఆశిస్తున్నాం. వీబీ జీ రామ్ జీలో ఎక్కువ పని దినాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం” అని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు.

# కాశీలో బాలాజీ ఆలయానికి 10 ఎకరాలు కేటాయించాలి

మొదటి పేజి తరువాయి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సభలో ఆయన తన వాగ్ధాటితో సభికులను ఉత్తేజపరిచారు. ప్రధాని మోదీ పాలన, దార్శనికత, దేశానికి అందిస్తున్న సేవలను వివరిస్తూనే, ఆంధ్రప్రదేశ్‌తో కేంద్ర ప్రభుత్వ బంధాన్ని బలంగా చాటిచెప్పారు. చంద్రబాబు ప్రసంగం ప్రారంభించకముందే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆయనను ప్రత్యేకంగా అభినందించడం, ప్రసంగం ముగిశాక “వెరీ వెల్... వెరీ వెల్” అంటూ ప్రశంసించడం సభలో అందరి దృష్టినీ ఆకర్షించింది. చంద్రబాబు తన ప్రసంగాన్ని హర హర మహాదేవ్ అంటూ ఆధ్యాత్మిక కోణంలో ఆరంభించడం విశేషం.

'VKS' మంత్రం.. సరికొత్త నినాదం

ప్రధాని మోదీ ప్రస్థానాన్ని వివరిస్తూ చంద్రబాబు ‘ఎఖా’ అనే సరికొత్త మంత్రాన్ని ఆవిష్కరించారు. “ఎ అంటే మోదీ జన్మస్థలమైన వాద్‌నగర్, ఖ అంటే ఆయన కర్మభూమి అయిన కాశీ, వా అంటే ఆయన జన్మించిన సెప్టెంబర్ 17. ఈ ‘ఎఖా’ మంత్రం ప్రజాస్వామ్యంలో అత్యంత శక్తివంతమైనది. సానుకూల దృక్పథంతో కృషి చేస్తే ఎవరైనా అత్యున్నత శిఖరాలను అధిరోహించవచ్చని మోదీ నిరూపించారు” అని చంద్రబాబు అన్నారు. సామాన్య కుటుంబంలో పుట్టి, రైల్వే స్టేషన్‌లో టీ అమ్ముతూ, కష్టపడి చదువుకుని దేశ ప్రధాని స్థాయికి ఎదగడం యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

అభివృద్ధి, సంక్షేమంలో మోదీ మార్క్

మోదీ నాయకత్వంలో గత పదేళ్లలో దేశంలో జరిగిన అభివృద్ధిని చంద్రబాబు అంకెలతో సహా వివరించారు. “మోదీ పాలనలో 25 కోట్ల మంది బహుముఖ పేదరికం నుంచి బయటపడ్డారు. 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు, 12 కోట్ల కుటుంబాలకు మరుగుదొడ్లు, 4 కోట్ల మందికి గృహ వసతి కల్పించారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించాలన్నది ఆయన కల. పీఎం కిసాన్ కింద 11 కోట్ల మంది రైతులకు మధ్యవర్తులు లేకుండా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేశారు” అని తెలిపారు. కరోనా మహమ్మారి సమయంలో 140 కోట్ల మంది ప్రజల ప్రాణాలను కాపాడటమే కాకుండా, 100 దేశాలకు ఉచితంగా వ్యాక్సిన్లు అందించి మానవత్వాన్ని చాటుకున్నారని ప్రశంసించారు.

ఆత్మనిర్భర భారత్ నుంచి సాంకేతికత వరకు

రక్షణ రంగంలో భారత్ సాధించిన ప్రగతిని చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. “ఒకప్పుడు రక్షణ పరికరాలను దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ నేడు మనమే సొంతంగా తయారు చేసుకుంటున్నాం. స్పేస్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, సెమీకండక్టర్, క్వాంటమ్ టెక్నాలజీ వరకు అన్నింటిపైనా అవగాహన ఉన్న ఏకైక నేత మోదీ” అని కొనియాడారు. స్టార్టప్‌ల ద్వారా యువత ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదిగిందని, మహిళా సాధికారతకు -బేటీ బచావో- నుంచి -లఖ్‌పతి దీదీ- వరకు అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు.

కాశీలో బాలాజీ ఆలయానికి స్థలం ఇవ్వండి

తన ప్రసంగంలో భాగంగా ఆయన అయోధ్య రామజన్మభూమి అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. దశాబ్దాలుగా నలుగుతున్న అయోధ్య వివాదాన్ని ప్రధాని నరేంద్ర మోదీ పరిష్కరించి, రామ మందిర కలను సాకారం చేశారని చంద్రబాబు కొనియాడారు. ఈ సందర్భంగా సభికులను ఉద్దేశించి “నేను చెప్పింది నిజమే కదా?” అని ప్రశ్నిస్తూ, అందరితో “జై శ్రీరామ్” అని గట్టిగా నినాదాలు చేయించారు. దీంతో వారణాసిలోని రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్ ఒక్కసారిగా ఆ నినాదాలతో మార్మోగింది.

ఈ సందర్భంగా చంద్రబాబు ఒక ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. “నేను పవిత్రమైన తిరుమల శ్రీ బాలాజీ కొలువైన నేల నుంచి వచ్చాను. ఈ చారిత్రక కాశీ నగరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలనుకుంటున్నాం. దీని కోసం 5 నుంచి 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కోరుతున్నాను” అని అన్నారు. ఈ ప్రకటనకు సభికుల నుంచి భారీ స్పందన లభించింది. అయోధ్యలో రామమందిర నిర్మాణం చరిత్రాత్మకమని, వారసత్వ సంపదను కాపాడుతూనే అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం మోదీకే సాధ్యమైందని చంద్రబాబు అన్నారు.

### ఏపీకి అండగా ఎన్డీఏ

ఎన్డీఏ కూటమి బంధం విడదీయరానిదని చంద్రబాబు స్పష్టం చేశారు. “అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వం మాకు అండగా నిలిచింది. సహకార సమాఖ్య స్ఫూర్తి మాకు కేవలం నినాదం కాదు, అది మా రోజువారీ అనుభవం. మేం కలిసే ఉన్నాం, భవిష్యత్తులోనూ కలిసే ఉంటాం. మన ఐక్యతే దేశానికి బలం” అని పునరుద్ఘాటించారు. సరైన సమయంలో, సరైన ప్రదేశంలో, సరైన నాయకుడు ఉండటం దేశానికి లభించిన గొప్ప అదృష్టమని, ఆ నాయకుడే నరేంద్ర మోదీ అని చంద్రబాబు తన ప్రసంగాన్ని ముగించారు. ఆయన ప్రసంగానికి సభికులు లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలిపారు.

## కేసీఆర్, కుటుంబ ఆస్తులపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు..

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ ఆస్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ముఖ్యమంత్రి విషప్రచారం చేస్తున్నారని, ఇందుకు ఆయన తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్‌కు ఉన్నది 1,000 ఎకరాలు కాదని, కేవలం 67 ఎకరాలు మాత్రమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రే అసెంబ్లీ వేదికగా అంగీకరించారని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ముఖ్యమంత్రికి ఓ సవాల్ విసిరారు. “కేసీఆర్ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు మా కుటుంబం ఆస్తులపై పూర్తిస్థాయి విచారణకు మేము సిద్ధం. మరి పుట్టినప్పటి నుంచి మీ ఆస్తులపై విచారణకు మీరు సిద్ధమా?” అని రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ వ్యవసాయాన్ని ప్రేమించే నిజమైన రైతు అని, ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ ఆయన సాగు చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. కొందరు భూమిని ఒక వ్యాపార వస్తువుగా చూస్తే, కేసీఆర్ మాత్రం దానిని ఎంతో పవిత్రంగా భావిస్తారని పేర్కొన్నారు. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములపై అనవసర రాద్ధాంతం చేస్తూ రేవంత్ రెడ్డి ‘సెల్ఫ్ గోల్’ చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. కేసీఆర్ తండ్రికి వందల ఎకరాల ఆస్తి ఉండేదని, చింతమడకలోని తమ పాత ఇంటిని ప్రభుత్వ పాఠశాల కోసం విరాళంగా ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. 22ఏ బాధితులకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగడతామని ఆయన పునరుద్ఘాటించారు.

## పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు

అమరావతి: ఏపీలో డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తయి ఏడాది గడిచిన తర్వాత, కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకు వైసీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని అనిత మండిపడ్డారు. వైసీపీ అధినేత జగన్ పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధారమైన వ్యాఖ్యలు చేయడం అలవాటుగా మార్చుకున్నారని, అసలు వాస్తవాలు ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలుసని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే వీరికి తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. మరోవైపు, ఏపీపీఎస్సీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే వైసీపీ ఈ రాద్ధాంతం చేస్తోందని అప్పసాని రాజేశ్ ఆరోపించారు. డీఎస్సీ నియామకాలను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు వేసిన 320 కేసులను న్యాయస్థానం కొట్టివేసిందని గుర్తు చేశారు. గత ఐదేళ్ల పాలనలో ‘జాబ్‌లెస్ క్యాలెండర్’తో యువతను మోసం చేసిన జగన్, ఇప్పుడు అత్యంత పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

### రాజకీయాల్లో హుందాతనానికి ప్రతీక నాని..
## మంత్రి లోకేశ్ భావోద్వేగ నివాళి

అమరావతి: మాజీ ఉప ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ నేత ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) మరణం పట్ల రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో హుందాతనానికి, రాజనీతికి ఆళ్ల నాని ప్రతీకగా నిలిచారని, ఆయన మరణంతో ఆంధ్రప్రదేశ్ ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందని అన్నారు. ఏలూరులోని ఆళ్ల నాని నివాసానికి చేరుకున్న లోకేశ్, ఆయన పార్థివదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మీడియాతో మాట్లాడుతూ.. “ఆళ్ల నాని అన్న మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మంత్రిగా ఉన్న సమయంలో నేను ఎమ్మెల్సీగా శాసనమండలిలో ఉన్నాను. సభలో ఎన్నో అంశాలపై వాడివేడిగా చర్చించేవాళ్ళం. కానీ, ఆయన ఏనాడూ వ్యక్తిగత దూషణలకు దిగలేదు. ప్రజా సమస్యలపై మాట్లాడటానికే సభ సమయాన్ని ఉపయోగించాలని బలంగా నమ్మిన వ్యక్తి ఆయన. రాజకీయాల్లో హుందాతనం ఎలా ఉండాలో ఆచరణలో చూపించారు” అని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా వివిధ హోదాల్లో ఆళ్ల నాని రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని లోకేశ్ కొనియాడారు. “ముఖ్యంగా, ప్రపంచం గజగజలాడిన కోవిడ్ మహమ్మారి సమయంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా నాని అందించిన సేవలు మరువలేనివి. ఎన్నో సవాళ్లు, ఒత్తిళ్లు ఎదురైనా వాటిని అధిగమించి, ప్రజల ప్రాణాలను కాపాడటానికి, నమ్ముకున్న నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ఆయన అహర్నిశలు శ్రమించారు” అని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీలో ఆళ్ల నాని చేరిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ.. “మీరు క్రమశిక్షణ అనే పాఠశాలకు చెందినవారు. ఎప్పుడూ లక్ష్మణ రేఖ దాటని మీలాంటి వారిని చూసే మాలాంటి యువత రాజకీయాల్లోకి రావాలనుకుంటుంది అని నేను నాని అన్నతో చెప్పాను. అలాంటి గొప్ప వ్యక్తి ఈరోజు మన మధ్య లేకపోవడం అత్యంత బాధాకరం” అని లోకేశ్ అన్నారు. ఆళ్ల నాని కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తరఫున, వ్యక్తిగతంగానూ ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆళ్ల నాని అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తున్నట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. మంత్రి కొలుసు పార్థసారథి ఏలూరులోనే ఉండి అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం, టీడీపీ తరఫున ఆళ్ల నానికి ఘన నివాళులు అర్పిస్తున్నామని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొలుసు పార్థసారథి, డా. నిమ్మల రామానాయుడు, ఎంపీ పుట్టా మహేష్ కుమార్, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, టీడీపీ నాయకులు పాల్గొని ఆళ్ల నానికి నివాళులర్పించారు.

## వీర్నాల ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం..
## ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఆకూరి శ్రీనివాసరావు



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ వీర్నాల ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఆకూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు.గురువారం వీర్నాల ఫౌండేషన్ అధినేత వీర్నాల బాలాజీ జన్మదినోత్సవం సందర్భంగా ఏపీఎన్జీవో నాయకులు ఆయనను ఇంటి వద్ద కలిసి పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ,సామాజిక సేవా దృక్పథంతో వీర్నాల ఫౌండేషన్ ఎంతోమంది పేదలకు ఆసరాగా నిలుస్తుందని తెలియజేశారు. ఏపీఎన్జీవో భవన నిర్మాణంలో వీర్నాల ఫౌండేషన్ పాత్రను అభినందించారు. భవిష్యత్తులో భవన నిర్మాణం పూర్తయ్యేంతవరకు తమకు అవసరమైన తోడ్పాటు అందించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వేమవరపు సీతారామయ్య, మచిలీపట్నం టౌన్ అధ్యక్షుడు లక్ష్మీ శ్రీనివాస్, కార్యదర్శి బి. శ్రీనివాసరావు, కోశాధికారి చెన్నకేశవరావులతో పాటు పలువురు జిల్లా, టౌన్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

## మంటాడలో ఘనంగా 'పోషణ్ అభియాన్' వేడుకలు



మంటాడ శ్రీవార్త న్యూస్ 9వ జాతీయ పోషకాహార మహోత్సవంలో భాగంగా పామర్రు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మంటాడ అంగన్‌వాడీ కేంద్రం నందు 'పోషణ్ అభియాన్' అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ వైద్యులు డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ, గర్భిణీలు, బాలింతలు మరియు చిన్న పిల్లలలో పోషకాహార లోపాన్ని నిర్మూలించడమే ఈ జాతీయ పోషణ్ అభియాన్ మిషన్ యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. నిత్యం ఆకుకూరలు, కూరగాయలు, సీజనల్ ఫ్రూట్స్ మరియు చిరుధాన్యాలతో కూడిన పోషకాహారాన్ని తీసుకోవడం వల్ల రక్తహీనత (అనీమియా) బారిన పడకుండా ఉండవచ్చని స్పష్టం చేశారు. ఈ సదస్సులో గర్భిణీలు, బాలింతలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు మరియు ఎంఎస్కేలు పాల్గొన్నారు.

## పూజలు చేస్తున్న విక్కుర్తి పార్టీ నేతలు
## గుల్లలమోద క్షిపణి పరీక్షా కేంద్రం పట్ల నరేంద్ర మోదీ ప్రత్యేక శ్రద్ధ



అవనిగడ్డ సెప్టెంబర్ 17 శ్రీవార్త గుల్లలమోద క్షిపణి పరీక్షా కేంద్రం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలుగుదేశం పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు కొనియాడారు.నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విక్కుర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవనిగడ్డ రాజీవ్ గాంధీ బొమ్మ సెంటర్లోని శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.నరేంద్ర మోదీ పేరిట విక్కుర్తి ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ నిర్వాహకులు కోట పోతరాజు ఆలయ మర్యాదలతో విక్కుర్తిని సత్కరించారు.ఈ సందర్భంగా విక్కుర్తి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం భారతదేశంలోని ప్రతి కుటుంబంలో పండుగ రోజు అన్నారు. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా నరేంద్ర మోదీ తయారు చేశారన్నారు. ప్రధానమంత్రిగా తాను పనిచేసిన 13 సంవత్సరాల కాలంలో భారతదేశంలో ఎన్నో కొత్త సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ప్రపంచ దేశాలకు భారతదేశాన్ని ఆదర్శవంతమైన దేశంగా తీర్చిదిద్దిన ఘనత నరేంద్ర మోదీకే దక్కుతుందన్నారు. జాతీయ రహదారులు, ఇస్రో సంస్థ, డిఫెన్స్ తదితర రంగాలలో భారతదేశాన్ని ముందంజలో నిలిపారన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన బ్రిక్స్ దేశాల సమావేశంలో ఆయా దేశాల ప్రతినిధులు నరేంద్ర మోదీ సేవలను కొనియాడిన విషయాలను గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్ ల సారథ్యంలో భారతదేశం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అతి కొద్ది సంవత్సరాలలోనే నరేంద్ర మోదీ ఆశించిన విధంగా వికసిత్ భారత్ నెరవేరుతుందన్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో గుల్లలమోదలో నిర్మిస్తున్న క్షిపణి పరీక్షా కేంద్రం పనులను ప్రతి 15 రోజులకు ఒకసారి మోదీ రివ్యూ చేస్తున్నట్లు చెప్పారు. గుల్లలమోదలో నిర్మిస్తున్న క్షిపణి పరీక్షా కేంద్రంతో భారతదేశంలో అవనిగడ్డ నియోజకవర్గానికి గుర్తింపు తెచ్చిన ఘనత నరేంద్ర మోదీకే దక్కుతుందని విక్కుర్తి ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, బిజెపి మండల అధ్యక్షులు శోభిల ఏడుకొండలు, రాజశేఖర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఘంటసాల రాజమోహనరావు, క్లస్టర్ ఇంచార్జ్ బండే రాఘవ, పులిగడ్డ చంద్ర, యూనిట్ ఇంచార్జ్ కమ్మిలి సుబ్రహ్మణ్యం, లుక్కా శ్రీనివాసరావు, విక్కుర్తి సుబ్బారావు, కోట సాయికృష్ణ, ధరావత్తు శ్రీనివాసరావు, లింగం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## రాయపూడిని పరామర్శించిన వైసీపీ నేత గౌతమ్

రాయపూడి కి గౌతమ్ పరామర్శ



అవనిగడ్డ సెప్టెంబర్ 17 శ్రీవార్త జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి, ప్రముఖ న్యాయవాది రాయపూడి వేణుగోపాలరావు ని వైసీపీ నేత గౌతమ్ గురువారం పరామర్శించారు. ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురైన వేణుగోపాలరావు విజయవాడలోని సెంటిని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం వారి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. గౌతమ్ గోపాల రావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, వేణుగోపాలరావు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.

## మొక్కల పంపిణీ చేస్తున్న బిజెపి కూటమినేతలు
## నగరాయిలు ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ




అవనిగడ్డ సెప్టెంబర్ 17 శ్రీవార్త భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా గురువారం అవనిగడ్డ మండలం వేకనూరు గ్రామంలో బిజెపి కిసాన్ మోర్చా కౌలు రైతుల రాష్ట్ర కన్వీనర్ జీవీ నగరాయలు ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ చేసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ అవనిగడ్డ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు జనసేన నాయకులు గుడివాక శివరాం తెలుగుదేశం నాయకులు బండే రాఘవ బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చాట్రాగడ్డ రాజశేఖర్ బిజెపి సోషల్ మీడియా నియోజకవర్గం ఇన్చార్జి కొమ్మినేని ఉమామహేశ్వర రావు బిజెపి నాయకులు గీతాకృష్ణ అల్లూరి శివ శ్రీనివాసరావు తెలుగుదేశం నాయకులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గుండాబత్తిన గీతా కృష్ణ పండ్లు పంచారు

## నిరసన తెలుపుతున్న గ్రామ సేవకులు
## వీఆర్ఏ లకు పే స్కేలు అమలు చేయాలి




అవనిగడ్డ సెప్టెంబర్ 16 శ్రీ వార్త గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘాల జాయింట్ యాక్షన్ రాష్ట్ర కమిటీ జేఏసీ పిలుపుమేరకు ఈనెల 15వ తేదీ నుండి సామూహిక నిరాకరణ సమ్మె చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది ఈ పిలుపులో భాగంగా రెండవ రోజు గురువారం జిల్లా వీఆర్ఏల సంఘం అధ్యక్షులు బొడ్డు వెంకటరత్నం ప్రధాన కార్యదర్శి రమేష్ ల ఆధ్వర్యంలో మా సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మెబాట చేపట్టామని అధ్యక్షులు దోవారి ముసలయ్య సెక్రటరీ మునిపల్లి నాగేశ్వరావులు నిరసన తెలుపుతూ మాట్లాడుతూ వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలని నామిని గా పనిచేస్తున్న వీఆర్ఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని అర్హులకు ప్రమోషన్ ఇవ్వాలని కారుణ్య నియామకాలు చేపట్టాలని వీఆర్ఏ నుండి వీఆర్వో గా ప్రమోషన్ ఇవ్వాలని జీవో నెంబర్ 13 ప్రకారం సీనియార్టీ ప్రకారం ఇంటర్ క్వాలిఫికేషన్ తో ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వీఆర్ఏ జోష్ణ తో పాటు పలువురు గ్రామ సేవకులు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన వీర్నాల ఫౌండేషన్
## అధినేత బాలాజీ జన్మదిన వేడుకలు



గూడూరు శ్రీ వార్త న్యూస్ గూడూరు మండలం కోకా నారాయణపాలెం గ్రామంలో వీర్నాల ఫౌండేషన్ అధినేత వీర్నాల బాలాజీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ జన్మదిన మహోత్సవానికి వివిధ పార్టీల నాయకులు, వీర్నాల అభిమానులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరై వేడుకలను



తిలకించారు.కార్యక్రమంలో భాగంగా ముందుగా గ్రామంలో వెలసిన సీతారామ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల నడుమ భారీ కేక్ కటింగ్ చేసి, గజమాలతో బాలాజీని ఘనంగా సత్కరించారు.అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తదుపరి ఏర్పాటు చేసిన వేదికపై నాయకులు, అభిమానులు బాలాజీ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## సీనియర్ పాత్రికేయుడు నందం
## రామారావు కుమార్తె నందం పద్మావతి మృతి

**ఆమె పార్థివ దేహానికి నివాళులు అర్పించిన కొనకళ్ళ నారాయణ, పాత్రికేయులు**



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్‌సీనియర్ పాత్రికేయులు, కథ, నవల రచయిత నందం రామారావు ద్వితీయ కుమార్తె నందం పద్మావతి



బుధవారం అర్ధరాత్రి మృతి చెందారు.ఆమె మృతితో నందం రామారావు కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుమార్తె మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తూ పద్మావతి మృతదేహం వద్ద కన్నీటి పర్యంతమయ్యారు.ఆమె భౌతిక కాయాన్ని మచిలీపట్నం హౌసింగ్ బోర్డు ప్రాంతంలోని నందం రామారావు స్వగృహంలో ఉంచారు. ఆమె పార్థివ దేహానికి ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, పాత్రికేయులు తదితరులు నివాళులు అర్పించారు.

## బియ్యం డెలివరీని త్వరితగతిన పూర్తి చేయాలి.....
## కృష్ణాజిల్లా పౌరసరఫరాల అధికారి టీ.శివరామ ప్రసాద్



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్‌కృష్ణాజిల్లాలో ప్రభుత్వానికి అందించాల్సిన సిఎంఆర్ బియ్యం డెలివరీని త్వరితగతిన పూర్తి చేయాలని కృష్ణాజిల్లా పౌరసరఫరాల అధికారి టీ. శివరామ ప్రసాద్ సంబంధిత రైస్ మిల్లర్లను ఆదేశించారు. జాయింట్



కలెక్టర్, కృష్ణా జిల్లా వారి ఆదేశాల మేరకు జిల్లాలో సిఎంఆర్ బియ్యం డెలివరీ పురోగతిపై సమీక్ష నిర్వహించారు.జిల్లాలో ఇప్పటివరకు 78,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, అందుకు అనుగుణంగా 45,071 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండగా, ఈ రోజు వరకు 41,327 మెట్రిక్ టన్నుల సిఎమ్ఆర్ బియ్యాన్ని మాత్రమే ప్రభుత్వానికి డెలివరీ చేశారు. ఇంకా మిగిలిన 3,742 మెట్రిక్ టన్నుల సిఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి డెలివరీ చేయాల్సి ఉంది.పెండింగ్ లో ఉన్న 3,742 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని 16 మంది రైస్ మిల్లర్లు ఒక వారంలోగా ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వానికి డెలివరీ చేయాలని డీఎస్ఒ టీ శివరామ ప్రసాద్ స్పష్టం చేశారు.నిర్దేశించిన గడువులోగా సిఎంఆర్ బియ్యం డెలివరీ చేయడంలో విఫలమయ్యే మిల్లర్లపై నిబంధనల ప్రకారం బ్యాంకు గ్యారెంటీని జప్తు చేయడం, సదరు మిల్లును బ్లాక్ లిస్ట్ లో చేర్చడంతో పాటు ఇతర చట్టపరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.ఈ సమావేశంలో డీ యం సీ ఎస్ జి. వరలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ పివి సత్యనారాయణ, సీ ఎస్ డిటీ ఎన్ వి ఎస్ ప్రధానీ మరియు ఇతర నలుగురు సీ ఎస్ డిటీలు మరియు సంబంధిత మిల్లర్లు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి తరలివచ్చిన గణనాధునితో భక్తులు
## శ్రీ లక్ష్మీ గణపతి గణనాధుని కోలాహలంగా నిమజ్జనోత్సవం



అవనిగడ్డ సెప్టెంబర్ 17 శ్రీవార్త అవనిగడ్డ మూడవ వార్డులోని చెన్నగిరి లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ గణపతి 19వ వార్షికోత్సవం సందర్భంగా నాలుగవ రోజు అయిన గురువారం ఉదయం స్వామివారికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకమైన వాహనం పై ఏర్పాటుచేసి మేళ తాళాలు డప్పు కోలాటాలు ఏమీ లేకుండా భక్తులు శ్రీరామ నామం జపించుకుంటూ ప్రశాంతంగా కృష్ణా నదిలో నిమజ్జనోత్సవం నిర్వహించారు. రెండవ వార్డులోని అవనిగడ్డ సెల్ఫోన్ షాపుల వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాధుని ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాధుని భారీ మేళతాళాలతో ఊరేగింపుగా తరలివచ్చి కృష్ణా నదిలో నిమగ్నం చేశారు,

## మన అంగన్వాడీ - మన బాధ్యత



ఘంటసాల, శ్రీవార్త :మొవ్వ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పోషణ -2026 మండల పరిధిలోని ఘంటసాల సెక్టార్ లోని పెదగూడెం -1 అంగన్వాడి కేంద్రం లో ఐసిడిఎస్ సూపర్వైజర్ టి.రమా నాగమణి ఆధ్వర్యంలో మన అంగన్వాడి - మన బాధ్యత కార్యక్రమం గురువారం నిర్వహించారు. సూపర్వైజర్ టి.రమా నాగమణి మాట్లడుతూ మన శరీరానికి కావలసిన శక్తిని, ఆరోగ్యాన్ని అందించే విటమిన్లు, ప్రొటీన్లు ఖనిజ లవణాలు ఉన్న సమతుల ఆహారాన్ని పిల్లలకు అందించాలని తల్లితండ్రులకు అవగాహన కల్పించడం జరిగింది. అంగన్వాడీ కేంద్రంలో మెనూ ప్రకారం అందించే వేడి భోజనం గురించి వివరించారు. తల్లిదండ్రులు పిల్లలకు అందించే పోషకాహారం ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పోషకాహార లోపం లేని పిల్లలను సమాజానికి అందించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం జరిగింది. అంగన్వాడీ కార్యకర్త పి.రుక్మిణి, హెల్పర్ బి.సరిత, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లితండ్రులు పాల్గొన్నారు

## కనీస వేతనంపై పేస్కేల్ ను అమలు చేయాలి
## -వీఆర్ఏల నుండి వీఆర్వోలు గా ప్రమోషన్ ఇవ్వాలి



ఘంటసాల, శ్రీవార్త :ఘంటసాల మండలం రెవిన్యూ సహాయకుల సంఘం, రాష్ట్ర రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపుమేరకు 15. నుండి నిరవధిక సమ్మె చేపట్టడం జరిగిందని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ముకూరి బాపూజీ గురువారం పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ మండల రెవెన్యూ శాఖల సంఘం అధ్యక్షుడు వక్కలగడ్డ వేణుగోపాలరావు , కార్యదర్శి నెరుసు వెంకటేశ్వరరావు కోశాధికారి కొండేటి మౌనిక వారి ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెను మండల రెవెన్యూ ఆఫీస్ వద్ద చేపట్టడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కమిటీ వారు మాట్లాడుతూ కనీస వేతనమైన పే స్కేల్ ను అమలు చేయాలని, అర్హులని వి ఆర్ ఏ లకు ప్రమోషన్ ఇవ్వాలని, కార్నర్ నియామకాలను చేపట్టాలని, వీఆర్ఏ నుండి వీఆర్వో గా ప్రమోషన్ జీవో 13 సీ నాటి ప్రకారం ఇంటర్ క్వాలిఫికేషన్ తో ప్రమోషన్ ఇవ్వాలని, నామిని వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలని, అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని ప్లే కార్డులతో నిరసన తెలియజేశారు.

## భారతదేశ నిర్మాణంలో
## ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.




ఘంటసాల, శ్రీవార్త :పరిశుభ్రమైన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కెవికె సమన్వయకర్త డాక్టర్ డి. సుధారాణి పేర్కొన్నారు. "స్వచ్ఛతా హీ సేవా" కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతా ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని డాక్టర్ సుధారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు.. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కాపాడటం, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా చూడటం, ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగాన్ని తగ్గించడం, తడి పొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించడం వంటి అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ లేదా స్థానిక సంస్థల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. మన ఇల్లు, కార్యాలయం, గ్రామం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, ఇతరులకు కూడా స్వచ్ఛతపై అవగాహన కల్పించాలని సూచించారు. "స్వచ్ఛతే సేవ -- పరిశుభ్రతే ఆరోగ్యం" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛతపై ప్రజల్లో బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన సుందరమైన సమాజ నిర్మాణానికి తోడ్పడవచ్చని తెలిపారు. కేవీకే శాస్త్రవేత్తలు సిబ్బంది పాల్గొన్నారు.

## సేవా సంకల్ప్ అభియాన్‌లో
## ఆరోగ్య కార్యక్రమాన్ని ప్రారంభించిన - తాడికొండ చిన్నా...



ఘంటసాల, శ్రీవార్త :భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో చేపట్టిన ఆరోగ్య కార్యక్రమాన్ని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి, శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) గురువారం ప్రారంభించారు. తాడికొండ చిన్నా మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రజా జీవితంలో ఆయన 25 ఏళ్ల సేవా ప్రస్థానాన్ని గుర్తు చేసుకుంటూ సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఆరోగ్య కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడం, ప్రజలకు ఆరోగ్య సేవలను చేరువ చేయడం, సేవా కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. పీహెచ్‌సీ వైద్యురాలు సాయి శరణ్య, అనిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కొండవీటి పవన్ కుమార్, గాదె వెంకట దుర్గా ప్రసాద్, మేక శ్రీనివాసరావు, ఆసుపత్రి సిబ్బంది మోర్ల చిరంజీవి, వాణిశ్రీ, రత్నా కుమారి, ఏడుకొండలు, ఆశా వర్కర్లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో తాగునీటి సమస్యపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి

## తూర్పు నియోజకవర్గ ప్రజల దాహార్తిని తీర్చాలి వైఎస్సార్‌సీపీ జిల్లా వాలంటరీ విభాగం అధ్యక్షులు పీలా ప్రేమ్ కిరణ్



విశాఖపట్నం, సెప్టెంబర్ 17, : విశాఖపట్నం నగరంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ముఖ్యంగా తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా వాలంటరీ విభాగం అధ్యక్షులు పీలా ప్రేమ్ కిరణ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం విశాఖపట్నం మద్దిలపాలెంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రేమ్ కిరణ్ మాట్లాడుతూ, ప్రపంచ పటంలో సుందరమైన నగరంగా గుర్తింపు పొందిన విశాఖపట్నం ప్రస్తుతం తాగునీటి సమస్యతో వార్తల్లో నిలుస్తోందన్నారు. గత కొన్ని రోజులుగా ప్రజలు కనీసం గుక్కెడు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ముఖ్యంగా తూర్పు నియోజకవర్గంలోని వాసవానిపాలెం, శివగణేష్ నగర్, ఎంవిపి కాలనీ వెంకోజిపాలెం సింహాద్రిపురం ఆరిలోవ తదితర ప్రాంతాల్లో ప్రజలు ఉదయం నుంచే నీటి కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. సాధారణ, మధ్యతరగతి కుటుంబాలు రోజువారీ పనులకు వెళ్లాల్సిన సమయంలో నీటి కోసం క్యూలలో నిలబడుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలి. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రజల తాగునీటి సమస్యపై తక్షణమే స్పందించాలని ప్రేమ్ కిరణ్ కోరారు. ప్రజలు మూడు, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నుకున్న నాయకుడిగా నియోజకవర్గంలోని ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చే బాధ్యత ఆయనపై ఉందన్నారు. వినాయక చవితి కార్యక్రమాలు, పెద్దమనిషి ఫంక్షన్ లో పేరంటాలు కార్యక్రమాలు వాటిల్లో పాల్గొనడం గానీ ప్రజలు యొక్క కష్టాలు తెలుసుకొని నీటి సమస్య ఉన్నటువంటి ప్రాంతాల్లో తిరిగి ఎంత మందికి భరోసా కల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు. నీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వం తక్షణమే ఉచిత వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు అందించాలని ప్రేమ్ కిరణ్ డిమాండ్ చేశారు. నీటి ట్యాంకర్ల కోసం సామాన్య కుటుంబాలు అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోందని, ఇది ప్రజలపై ఆర్థిక భారాన్ని పెంచుతోందని అన్నారు. ప్రజలందరూ కూడా రెండు మూడు రోజులు ఇంటి వద్దనే ఉండి పని కూడా వెళ్లకుండా వేచి చూడాల్సిన పరిస్థితి తూర్పు నియోజకవర్గంలో నెలకొంది. పోనీ రోడ్డు పక్కన ఉన్న హ్యాండ్ బోర్లైన ఉపయోగిద్దాం అంటే అభివృద్ధి పేరుతో తూర్పు నియోజకవర్గంలో ఉన్నటువంటి హ్యాండ్ బోర్లు అన్నీ కూడా తీసివేయడం జరిగింది. ఉన్న అరకురా హ్యాండ్ బోర్ లైన వాడి నీరు తెచ్చుకుందాం అంటే అవి కూడా శిథిలావస్థకు చేరుకున్న పరిస్థితి నెలకొంది. కనీసం వాటిని మరమ్మత్తులు చేయించాలన్న జ్ఞానం కూడా ఎమ్మెల్యే కి లేదు. పోనీ జీవీఎంసీ ఉచిత మంచినీటి సరఫరా ట్యాంకర్ తెప్పించుకుందామంటే ఈ కూటమి ప్రభుత్వంలో నీళ్లను కూడా బ్లాక్లో 1500 నుండి 3000 చొప్పున అమ్ముకునే పరిస్థితినెలకొంది. ఈ కూటం ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజల కళ్ళల్లో కన్నీళ్లు తీసుకురాగలిగారు గాని ప్రజల ఇంటికి నీళ్లను మాత్రం తీసుకు రాలేకపోయారు కానీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ పరిధిలో ప్రజలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరు అందించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అయితే ఇది ప్రభుత్వ బాధ్యతకు ప్రత్యామ్నాయం కాదని, అధికార యంత్రాంగం శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని ప్రాంతాల్లో లోతైన బోర్లు వేసి నీటిని వ్యాపార ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు దర్యాప్తు చేసి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్నారు. తాగునీటి సరఫరా, హ్యాండ్ బోర్ల మరమ్మతులు, నీటి ట్యాంకర్ల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విశాఖపట్నం తూర్పు నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రేమ్ కిరణ్ డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు కి నేషనల్ మీడియా వాటర్ మాన్ గా బిరుదు ఇచ్చారని ఆయన చెప్పుకున్నారని వాటర్ మ్యాను కాదు మాకు తెలియదు కానీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మాత్రం కోటర్మేనని ప్రజలు బిరుదు ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఎందుకంటే నియోజకవర్గంలో తాగడానికి గుక్కెడు మంచినీళ్ళు దొరకవు కానీ 24 గంటలు ఎమ్మెల్యే కొనసానల్లో బెల్ట్ షాపుల్లో సమయపరిమితికి మించి వైన్ షాపులో అక్రమంగా మద్యం ఏరులై పారుతుంది. ప్రజల దాహార్తిని తీర్చి వాటర్ ఇచ్చి మంచి మ్యాటర్ ఉన్న ఎమ్మెల్యేగా ప్రజల మన్ననలు పొందుతారో లేదంటే కోటరు ఇచ్చి కోటర్ మాన్ గా పేరును సార్థకత చేసుకుంటారో మీరే తేల్చుకోవాలని అన్నారు. ఉదయం 6 గంటలకి ఆరులో ప్రాంతానికి వెళితే నీటి కోసం గొడవలు ఆడుకుని ఒకరిమీద ఒకరిని ఒకరు కొట్టుకునే పరిస్థితికి వచ్చారు. మీకు ఆరిలోవ ప్రాంతానికి దారి తెలియకపోతే చెప్పండి ఎమ్మెల్యే నేను తీసుకెళ్లి మీకు చూపిస్తా అని అన్నారు. డేటా సెంటర్ పేరుతో జరుగుతున్న పనుల వలన కొండమీద నుంచి రిజర్వాయర్ లోకి వచ్చే వర్షపు నీరు కూడా వచ్చే దారి లేక ఆగిపోయింది. డేటా సెంటర్ ప్రారంభం కాకముందే ఎంత నీటి ఎద్దడికి గురైతే ఒకవేళ డేటా సెంటర్ ప్రారంభమైతే జనాలు పరిస్థితి ఏంటని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రజలందరూ ని కలిసి భవిష్యత్తులో తీసుకోబోయే చర్యలేమిటి నీరు ఏ విధంగా తీసుకొస్తారు అని ప్రజలకు చెప్పే బాధ్యత మీకు ఉంది అని అన్నారు. విశాఖపట్నంలో అప్పనంగా 99 పైసలకే ఎకరా భూమి దొరుకుతుంది కానీ విశాఖ వాసుల భవిష్యత్తు ఆలోచించి నీటి సమస్య పరిష్కారం దిశగా ఇంటింటికి ప్రభుత్వం ఉచితంగా ఇంకుడు గుంతలు మాత్రం తీయించి ఆలోచన చేయదు అని అన్నారు. సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరించి, తక్షణమే ఉపశమన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల ప్రాథమిక అవసరమైన మంచినీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అని, రాజకీయాలకు అతీతంగా ప్రజల దాహార్తిని తీర్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఘంటసాలలోని గణనాధునికి ప్రత్యేక పూజలు



ఘంటసాల, శ్రీవార్త:వినాయక చవితి సందర్భంగా ఘంటసాల గ్రామంలోని శ్రీజలధీశ్వర స్వామి ఆలయం ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన గణపతికి 4వ రోజు గురువారం గ్రామానికి చెందిన దోనేపూడి నవీన్ - స్వాతి దంపతులు కుమార్తె చినూత్నలు అర్చకులు చావలి కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. శ్రీజలధీశ్వర విగ్రహ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ పాలనలో భారత్ అగ్రగామిగా ఎదిగింది......వడ్డీ బాలకృష్ణ



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్‌భారత ప్రధాని నరేంద్ర మోడీ పరిపాలనలో ప్రపంచంలో భారతదేశం అగ్రగామిగా నిలిచిందని ప్రముఖ గోల్డ్ కవరింగ్ వ్యాపారివేత్త వడ్డీ బాలకృష్ణ అన్నారు. బుధవారం ప్రధాని నరేంద్ర మోడీ 76వ జన్మదినం సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం వెంకట గజేంద్ర రావు ఆధ్వర్యంలో వడ్డీ బాలకృష్ణతో పాటు 50 మంది బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్, ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్, జిల్లా అధ్యక్షులు తాత్తినేని శ్రీరామ్, జిల్లా ప్రముఖులు హాజరై వారిని పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా వడ్డీ బాలకృష్ణ మాట్లాడుతూ, మోడీ పరిపాలన భారతదేశానికి ఎంతో అవసరమని, మచిలీపట్నంలో పార్టీ ఎదుగుదలకు కృషి చేస్తానని తెలిపారు.

## జనసేన కార్యాలయంలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

## భారతదేశం గర్వించదగ్గ వ్యక్తి ప్రధాని మోదీ... బండి రామకృష్ణ




మచిలీపట్నం శ్రీవార్త న్యూస్‌మచిలీపట్నం జనసేన కార్యాలయంలో ఇంచార్జ్, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బండి రామకృష్ణ మాట్లాడుతూ, భారతదేశం గర్వించదగ్గ వ్యక్తి ప్రధాని మోదీ అని, ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వంపు గడవల చౌదరి మాట్లాడుతూ, భారతదేశ చరిత్రలో మోదీ ప్రధానిగా ఎన్నో సంస్కరణలు తెచ్చారని, ఇటువంటి గొప్ప వ్యక్తి దేశానికి ప్రధాని కావడం మన అదృష్టమన్నారు. గవర్నమెంట్ హాస్పిటల్ డైరెక్టర్ మొహ్మద్ బాషా మాట్లాడుతూ, మత సామరస్యాలను కాపాడుతూ ప్రధాని దేశానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గంపల దుర్గా భవాని మాట్లాడుతూ, ప్రధాని మోదీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు ఎండి సమీర్, పినిశెట్టి వేణు, ఈవన మణిబాబు, ఉచ చంటి, తిరుమలశెట్టి నాగరాజు, కర్రి మహేష్, వడ్డీ చిరంజీవి, పి. కోటి రెడ్డి, కూనపరెడ్డి ప్రసాద్, గంపల కృష్ణ, నరహరశెట్టి రామ్ జ్యోతి, కూనపరెడ్డి సురేష్, పినిశెట్టి కుమారి, తోట రాజేష్, బడే వెంకటేశ్వరరావు మరియు జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీ ప్రజాప్రయాణం అద్భుతం అద్వితీయం

కృష్ణాజిల్లామచిలీపట్నంసెప్టెంబర్ 17 ఆధునిక భారతదేశ చరిత్రను ప్రపంచ స్థాయిలో నిలిపిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేనని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం మంగినపూడి సముద్ర తీరంలో ఏర్పాటు చేసిన సాగర తీర మహాగణపతి నవరాత్రి ఉత్సవాల ప్రాంగణంలో "సేవా సంకల్ప్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా ఆశీర్వాద్ కా దియా నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి మధుకర్ గారు, బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీరామ్, ప్రసాద్, గజేంద్ర, బాలాజీ పలువురు బీజేపీ నాయకులతో కలిసి నరేంద్ర మోడీ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆ విఘ్నాధిపతి ఆశీస్సులు ఎల్లప్పుడూ నరేంద్ర మోడీ కి ఉండాలనే లక్ష్యంతో ఆ వినాయకుని సమక్షంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

# ముస్లిం విద్యార్థుల భవితకు భరోసానిస్తాం సంక్షేమ పథకాలు అందేలా చూస్తాం

మైనారిటీ రిజర్వేషన్లు పక్కాగా అమలవ్వాలి

ఏ సమస్య వచ్చినా మైనారిటీలకు అండగా నిలుస్తాం

అనంతపురంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీని సందర్శించిన అసెంబ్లీ మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్

స్థానిక నేతలతో కలిసి వర్సిటీ విద్యార్థులతో ముఖాముఖి

ఏపీ రెసిడెన్షియల్ పాఠశాల తనిఖీ

విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ



గుంటూరు సెప్టెంబర్ 17 ముస్లిం మైనారిటీ ముస్లిం మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడమే తమ లక్ష్యమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీని గురువారం స్థానిక ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా, మైనారిటీ అధికారులతో కలిసి అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ సందర్శించారు. తొలుత యూనివర్సిటీలోని విద్యార్థులు, లెక్చరర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. యూనివర్సిటీలో మైనారిటీ రిజర్వేషన్లు పక్కాగా అమలు చేస్తున్నారా ? మైనారిటీస్ పథకాలు అందుతున్నాయా ? అన్ని రకాల మౌలిక సదుపాయలు కల్పిస్తున్నారా ? ఏవైనా సమస్యలు ఉన్నాయా ? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ముస్లిం మైనారిటీ విద్యార్థులకు తాము అండగా నిలుస్తామని, ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముస్లిం విద్యార్థుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ కమ్యూనికేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ , రిజిస్ట్రార్ లను కలిశారు. మైనార్టీ విద్యార్థులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన పథకాలు సక్రమంగా వచ్చేలా చూడాలని కోరారు. బీసీ-ఈ రిజర్వేషన్లు పక్కాగా అమలు కావాలన్నారు. ఈ విషయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం గార్లదిన్నె గ్రామంలోని ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలను అసెంబ్లీ మైనారిటీ కమిటీ చైర్మన్ నసీర్ సందర్శించారు. అక్కడ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. హాస్టల్లో విద్యా బోధన, వసతి సదుపాయాలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో మౌలిక వసతులు, ప్రభుత్వ పరంగా అందుతున్న సదుపాయాలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సమస్యనూ స్థానిక కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. తొలుత అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ ను స్థానిక రాజకీయ పార్టీ నాయకులు, మైనారిటీ సంఘాల నేతలు వచ్చి కలిశారు. కూటమి ప్రభుత్వంలో మైనారిటీలకు అందుతున్న ప్రయోజనాల గురించి చర్చించారు.

# పారిశ్రామికవేత్తల సంక్షేమం, వ్యాపారాల విస్తరణే లక్ష్యం.

పారిశ్రామిక, వ్యాపార రంగ అభివృద్ధికి ప్రత్యేక వేదికగా ఇండస్ట్రియల్ బిజినెస్ మీట్‌లి

180 మంది పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికుల నుంచి సమస్యలు, దరఖాస్తుల స్వీకరణలి

ఉదయం నుంచి సాయంత్రం వరకు సమస్యలను ఓపికగా విన్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజి





మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ పారిశ్రామికవేత్తల సంక్షేమం, వ్యాపారాల విస్తరణే లక్ష్యంగా నిర్వహించిన ఇండస్ట్రియల్ బిజినెస్ మీట్ ద్వారా జిల్లాలో పెట్టుబడులు, పరిశ్రమల స్థాపన, వ్యాపారాల విస్తరణ, స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పనకు మరింత ఊతం లభిస్తుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పేర్కొన్నారు. కృష్ణా జిల్లాలో పారిశ్రామిక, వ్యాపార రంగాల అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందించడంతో పాటు, పరిశ్రమలు, వ్యాపారాల స్థాపన, విస్తరణలో ఎదురవుతున్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఇండస్ట్రియల్ బిజినెస్ మీట్‌కు విశేష స్పందన లభించింది. జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ప్రత్యేక చొరవతో నిర్వహించిన ఈ సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి 180 మందికి పైగా పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు హాజరై తమ సమస్యలు, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 180 దరఖాస్తులు నమోదయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల కృష్ణా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఒక వర్క్‌షాప్ అనంతరం ప్రజలతో సుమారు మూడున్నర గంటల పాటు జరిగిన చర్చలో పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులు తమ సమస్యలను వివరించిన నేపథ్యంలో, వారికి ప్రత్యేక వేదిక కల్పించాలనే ఉద్దేశంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. హడావుడికి తావులేకుండా నాణ్యమైన చర్చ, వాస్తవిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్యక్రమాన్ని రూపొందించామని, మాట్లాడటం కంటే సమస్యలను వినడానికే ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. ఈ సమావేశం కోసం తన ఇతర కార్యక్రమాలను రద్దు చేసుకుని రోజంతా దీనికే కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, సంబంధిత శాఖలు, బ్యాంకర్ల సమన్వయంతో సాధ్యమైన పరిష్కారాలను చూపించేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం పరిధిలో సాధ్యమైన సహాయాన్ని అందిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. సిబిల్ స్కోర్ వంటి అంశాల కారణంగా బ్యాంకు రుణాల మంజూరులో పరిమితులు ఉంటాయని, అలాగే వ్యక్తిగత ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన కొన్ని వివాదాల్లో జిల్లా యంత్రాంగం జోక్యానికి పరిమితులు ఉంటాయని వివరించారు. అయితే విద్యుత్, మౌలిక వసతులు, అనుమతులు, రుణ దరఖాస్తు విధానం, ప్రభుత్వ పథకాలపై అవగాహన వంటి అంశాల్లో సంబంధిత శాఖలను అనుసంధానం చేసి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. వ్యాపారం లేదా పరిశ్రమ ప్రారంభించాలనే ఆలోచన ఉన్నప్పటికీ రుణం కోసం ఎక్కడ దరఖాస్తు చేయాలి, ఏ పథకం ద్వారా ప్రయోజనం పొందవచ్చు, బ్యాంకును ఎలా సంప్రదించాలి అనే అంశాలపై అవగాహన లేని ఔత్సాహికులకు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, బ్యాంకుల రీజినల్ మేనేజర్లు తదితర అధికారులతో అనుసంధానం కల్పించి మార్గదర్శకత్వం అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశానికి హాజరైన వారు తొలుత పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో తమ పేర్లు నమోదు చేసుకోగా, అనంతరం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ పరిశ్రమల శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా, బ్యాంకర్లు, మత్స్య, ఉద్యాన, ఏపీఐఐసీ తదితర శాఖల అధికారుల సమక్షంలో ఒక్కొక్కరితో ముఖాముఖిగా మాట్లాడారు. ఉదయం ప్రారంభమైన ఈ సమావేశం సాయంత్రం వరకు కొనసాగింది. సమావేశంలో వచ్చిన దరఖాస్తుల్లో ఫైనాన్స్‌కు సంబంధించి 54, భూమి/ఏపీఐఐసీకి 35, పీఎంఈజీపీకి 25, మార్కెటింగ్‌కు 22 దరఖాస్తులు వచ్చాయి. ఇతర సమస్యలకు సంబంధించి 18, శిక్షణ/నైపుణ్యాభివృద్ధికి 9, పీఎంఎఫ్ఎంఈకి 4, అనుమతులు/పర్మిషన్లకు 3, ప్రోత్సాహకాలకు 3, కాలుష్యం/పర్యావరణానికి 2, నీటి సరఫరాకు 2, ఫైనాన్స్/పీఎంఈజీపీకి 1, విద్యుత్‌కు 1, రోడ్లకు 1 చొప్పున దరఖాస్తులు నమోదయ్యాయి. ఫైనాన్స్‌కు సంబంధించిన దరఖాస్తులు అధికంగా రావడంతో అర్హులైన పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులకు ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలపై పూర్తి అవగాహన కల్పించి, అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు రాయితీలతో కూడిన రుణ సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన వారికి ముద్ర, పీఎంఈజీపీ, ఉన్నతి, లక్‌పత్ దీదీ, పీఎంఎఫ్ఎంఈ తదితర పథకాల ద్వారా ప్రయోజనం కల్పించడంతో పాటు బ్యాంకు రుణాల మంజూరు




ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. భూ కేటాయింపులు, అనుమతులు, విద్యుత్, నీటి సరఫరా, రహదారులు, పారిశ్రామికవాడల్లో మౌలిక వసతులు, మార్కెటింగ్ తదితర అంశాలపై వచ్చిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కొన్ని సమస్యలను సమావేశంలోనే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించగా, మిగిలిన వాటిపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్ వెంకట్రావు, డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కే బాబ్జి, ఉద్యాన, మత్స్య శాఖల అధికారులు జే జ్యోతి, అయ్యా నాగరాజా, ఎల్డిఎం సి రవీంద్రారెడ్డి, ఆర్ సెటి డైరెక్టర్ స్వర్ణ శ్రీ, తపాల శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఎస్బిఐ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఎల్ వివి నాగేశ్వరరావు, ఖాదీ బోర్డు ఏడి శ్రావణ్ కుమార్, మెప్మా ఏవో డివి జగదీష్ తదితర అధికారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# ముచ్చటైన మరో మూడు పక్షులు





## పసుపు చెంప పిట్ట , పసుపు గొంతు బుల్‌బుల్ పిట్ట , లీసెర్ విజిలింగ్ డక్ బేబీ

## శేషాచల అడవుల్లో గుర్తించిన గరుడ అట్లాస్ బృందం

## తిరుపతి ప్రాంతంలో ఇప్పటివరకు 274 పక్షిజాతుల గుర్తింపు

తిరుపతి సిటీ: తిరుపతి శేషాచల అడవుల్లో తిరుపతి నేచర్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ సహకారంతో మరో మూడు అరుదైన పక్షి జాతుల్ని గుర్తించినట్టు గరుడ అట్లాస్ బృందం ఆదివారం వెల్లడించింది. తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐజర్) బృందంతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 50 మంది పరిశోధకులు పక్షిజాతుల గణన, వాటి వైవిధ్యం, మనుగడ, జీవన విధానంపై ప్రత్యేక సర్వే చేపట్టారు. 2022లో ఏర్పడిన తిరుపతి బర్డ్ అట్లాస్ ఇటీవల గరుడ అట్లాస్‌గా పేరు మార్చుకుని తిరుపతి పరిసర ప్రాంతాల్లోనూ, శేషాచల అడవుల్లోనూ సంచరించే పక్షిజాతుల డేటాను సేకరించేందుకు శ్రీకారం చుట్టింది. విడతల వారీగా అటవీ ప్రాంతాలలో సర్వే చేపట్టి అరుదైన పక్షి జాతులను గరుడ అట్లాస్ బృందాలు కెమెరాల్లో బంధిస్తున్నాయి. తిరుపతి ప్రాంతంలో తొలిసారిగా పసుపు చెంప పిట్ట (ఇండియన్ ఎల్లో టిట్) అనే అరుదైన పక్షిని కనిపెట్టామని గరుడ అట్లాస్ ప్రతినిధులు చెప్పారు. వీటితో పాటు పసుపు గొంతు బుల్‌బుల్ పిట్ట (ఎల్లో థ్రోటెడ్ బుల్‌బుల్), లీసెర్ విజిలింగ్ డక్ బేబీ వంటి అరుదైన పక్షిజాతులు తిరుపతి ప్రాంతంలో ఉండటం విశేషమన్నారు. కొండలపై నివసించే రాప్టర్ ఐన్ షాహీన్ ఫాల్కన్ పక్షులు సైతం తిరుమల ఘాట్ రోడ్డులో ఆవాసాలు ఏర్పాటు చేసుకోవడం హర్షణీయమని తెలిపారు.

### ఇప్పటివరకు 274 పక్షిజాతుల గుర్తింపు

మానవ సమాజంతో పక్షిజాతుల అనుబంధాన్ని బలోపేతం చేసేందుకు ఈ సర్వే చేపట్టినట్లు ఐజర్ బృందంలో పరిశోధకుడైన హరీష్ పేర్కొన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. తమ బృందాలు ఇప్పటివరకు తిరుపతి పరిసర ప్రాంతాల్లో 55 వేల పక్షుల గమనాలను పరిశీలించాయని చెప్పారు. ఇందులో 274 పక్షిజాతులు ప్రకృతిలో మమేకమై ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 5 ఎడిషన్లలో పక్షి జాతుల డేటాను సేకరించామని, వాటిని పూర్తి స్థాయిలో మ్యాపింగ్ చేశామని తెలిపారు. ఆయన వెంట పుష్యామిత్ర, టీఎన్ఎస్ ప్రతినిధి పి రామచంద్రారెడ్డి తదితరులున్నారు.

# దమ్ముంది.. దన్ను కావాలి

## ఇప్పటికైతే మనది 10వ స్థానం

## ఏఐ మేధోనిధి.. ఇండియా!

## మెరికలున్నా సదుపాయాల్లేవు

## నైపుణ్యం ఒక్కటే సరిపోదు

## సూపర్ కంప్యూటర్‌లు... భారీ పెట్టుబడులు అవసరం

## ఏఐ సదస్సు చూపిన 'ఇంపాక్ట్'



ఢిల్లీలో ఐదు రోజుల ఐఏ ఇంపాక్ట్ సదస్సు ఇటీవలే ముగిసింది. ఇండియా ఈ సదస్సును మొదటిసారి నిర్వహించింది. ప్రపంచ దేశాల నాయకులు ఇందులో పాల్గొన్నారు. కొత్త ఆవిష్కరణలపై అంతా దృష్టి పెట్టారు. ఇండియాకైతే ఇది ఒక కీలకమైన సందర్భం. మన ఏఐ వ్యవస్థలో ఉన్న బలాలు, పూరించుకోవలసిన లోట్లను ఈ సదస్సు స్పష్టం చేసింది.

### నిపుణుల సంఖ్యలో రెండో స్థానం

ఏఐ రంగంలో మెరికలు ఉన్న దేశంగా ఇండియా పేరు పొందింది. కానీ మౌలిక సదుపాయాల విషయంలో వెనుకబడి ఉంది. 2024 'టార్టాయిస్ గ్లోబల్ ఏఐ ఇండెక్స్' ప్రకారం, ఏఐ సామర్థ్యంలో ఇండియా ప్రపంచంలో 10వ స్థానంలో ఉంది. ఏఐ నిపుణుల సంఖ్యలో మాత్రం 2వ స్థానంలో నిలిచింది.

### సౌకర్యాలలో 68వ స్థానం

ఏఐ ఆపరేషన్స్‌లో ఇండియా 3వ స్థానంతో మంచి ప్రతిభ కనబరిచింది. అయితే కంప్యూటింగ్ పవర్, ఇతర సౌకర్యాల విషయంలో 68వ స్థానంలో ఉంది. ఈ కారణంగా అమెరికా, చైనాతో పోటీ పడటం భారత్‌కు కష్టం కావచ్చన్న అభిప్రాయం ఏఐ పరిశ్రమంలో వ్యక్తం అవుతోంది.

### ఉన్నది కొన్నే సూపర్ కంప్యూటర్‌లు

ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యంత శక్తివంతమైన 500 సూపర్ కంప్యూటర్లలో ఇండియా వాటా కేవలం 1 శాతం మాత్రమే. అంటే, ఏఐకి కావలసిన కంప్యూటింగ్ సామర్థ్యం మన దగ్గర చాలా తక్కువగా ఉంది. అమెరికా ఈ విషయంలో చాలా ముందుంది. ప్రపంచంలోని మొత్తం సూపర్ కంప్యూటర్లలో 35 శాతం సిస్టమ్‌లు, దాదాపు 48 శాతం కంప్యూటింగ్ సామర్థ్యం అమెరికా దగ్గరే ఉంది.

### ట్రైనింగ్ డేటాలో 3 శాతం వాటా

ఏఐ ట్రైనింగ్ డేటా రంగంలో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పెట్టుబడులలో భారతదేశం వాటా కేవలం 3 శాతం మాత్రమే. అంటే, మన దేశానికి చాలా తక్కువ పెట్టుబడులు అందుతున్నాయి. ఈ విషయంలో అమెరికా 56 శాతంతో అందరికంటే ముందుంది. ఆ తర్వాత చైనా 17 శాతంతో, ఐరోపా సమాఖ్య దేశాలు 15 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

### ప్రపంచాన్ని శాసించగలమా?

మన దగ్గర అద్భుతమైన తెలివితేటలు కలిగిన నిపుణులు ఉన్నారు. కానీ, ఆ తెలివితేటలకు తగ్గట్టుగా శక్తివంతమైన కంప్యూటర్లు, భారీ పెట్టుబడులు తోడవాల్సి ఉంది. అమెరికా, చైనా వంటి దేశాలతో పోటీ పడాలంటే, కేవలం సాఫ్ట్‌వేర్ నైపుణ్యం మాత్రమే సరిపోదు; సొంతంగా డేటా సెంటర్లు, సూపర్ కంప్యూటర్లను పెంచుకోవాలి. అప్పుడే ఇండియా ఏఐ ప్రపంచాన్ని శాసించ గలుగుతుంది.

**హెచ్.పి.సి. సిస్టమ్ : హై పెర్ఫార్మింగ్ కంప్యూటింగ్ (యంత్ర సామర్థ్యం)**
**హెచ్.పి.సి. కెపాసిటీ : హై పెర్ఫార్మింగ్ కెపాసిటీ (శక్తి సామర్థ్యం)**
**హెచ్.ఐ.సి.: హై ఇన్‌కం కంట్రీస్; యు.ఎం.ఐ.సి.: అప్పర్ మిడిల్ ఇన్‌కం కంట్రీస్**
**ఎల్.ఎం.ఐ. సి. : లోయర్--మిడిల్ ఇన్‌కం కంట్రీస్**

# నేటి పాత స్మార్ట్‌ఫోన్లే... రేపటి ఫైటర్ జెట్లు!

## ఫోన్ల నుంచి అరుదైన మూలకాల వెలికితీతకు యత్నాలు

కొత్త ఫోన్ కొనగానే పాతదానిని చెత్త ఫోన్ అంటూ చెత్తబుట్టలో పడేయడం చాలామందికి అలవాటు. కానీ ఆ పాత ఫోన్‌లో 'రేర్ ఎర్త్ ఎలిమెంట్స్'గా పిలిచే అత్యంత విలువైన భూ అయస్కాంత మూలకాలు అత్యంత సూక్ష్మపరిమాణంలో ఉంటాయి. వాటిని విదేశాల నుంచి వేలాది కోట్లు వెచ్చించి దిగుమతి చేసుకునే బదులు ఈ పాత ఫోన్ల నుంచే సంగ్రహిస్తే? కేంద్రం ఇప్పుడు సరిగ్గా ఇలాంటి ఆలోచనే చేస్తోంది. తద్వారా లక్షల కోట్ల విదేశీమారక ద్రవ్యం ఆదా అవుతుందని భావిస్తోంది! "టన్ను ముడిఖనిజం నుంచి కేవలం ఒకట్రెండు కిలోల కోబాల్ట్ మాత్రమే తీయగలం. అదే టన్ను పాత బ్యాటరీల నుంచి ఏకంగా 50 నుంచి 80 కేజీల దాకా సమీకరించవచ్చు. పైగా ముడిఖనిజ కోబాల్ట్ కంటే ఇది 40 ఎక్కువ గాఢత కలిగి ఉంటుంది" అని గ్రేటర్ నోయిడా కేంద్రంగా పనిచేసే లిథియం--అయాన్ బ్యాటరీ తయారీ సంస్థ 'లోహం' రీసైక్లింగ్ హెడ్ సయ్యద్ గజన్‌ఫర్ అబ్బాస్ సాఫ్వీ చెప్పారు. "ఇప్పటికే ఎంతో శ్రమించి తయారుచేసిన స్మార్ట్‌ఫోన్ వంటి ఈ--వేస్ట్‌లో ఎంతో విలువైన ఖనిజాలుంటాయి. వాటిపై భారత్ ఇప్పటిదాకా సరైన దృష్టి సారించలేదు" అని ఈ--వేస్ట్ మేనేజ్‌మెంట్, లిథియం--



అయాన్ బ్యాటరీ కంపెనీ అట్టెరో సహ వ్యవస్థాపకుడు నితిన్ గుప్తా చెప్పారు. యుద్ధ విమానాలు అత్యంత తేలిగ్గా, అత్యంత దృఢంగా ఉండటానికి నియోడైమియం వంటి ఈ మూలకాలే కారణం. వాటిలో ఇంధనం ప్రవాహాలు, రెక్కల కదలికలు, కాక్‌పిట్‌కు కరెంటు సరఫరా చేసే జనరేటర్లను పర్యవేక్షించే సెన్సార్లకు అవే శక్తినందిస్తాయి. "భారత్ ప్రస్తుతం ఈ--వేస్ట్‌ను విదేశాలకు అనవసరంగా ఎగుమతి చేస్తోంది. అలాగాక భారత్‌లోనే భారీగా శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలి. తద్వారా ఈ--వేస్ట్‌లోని భూ అయస్కాంత మూలకాలను సంగ్రహించి యుద్ధ విమానాల తయారీకి సదీ?వనియోగం చేసుకోవచ్చు. అత్యంత అరుదైన ఖనిజాల కోసం చైనా వంటి ప్రత్యర్థి దేశాలపై ఆధారపడే దురవస్థ తొలగుతుంది" అని ముంబై కేంద్రంగా పనిచేసే శుద్ధ సాంకేతిక సంస్థ 'లీకో' సీఈవో గౌరవ్ దోల్వానీ అన్నారు.

# మనోవేదనను 'మెషీన్' చెప్పేస్తుంది

## వాయిస్ శాంపిల్స్‌ను చిటికెలో విశ్లేషించి ముందే అప్రమత్తం చేస్తున్న మెషీన్ లెర్నింగ్ మోడల్స్

## తొలిదశలోనే మనోవ్యాధి లక్షణాలను పసిగట్టడంలో దోహదపడుతున్న సాంకేతికత

## తాజా ప్రయోగాల్లో 70 శాతం నుంచి 96 శాతం వరకు కచ్చితత్వంతో ఫలితాలు

## ఢిల్లీ ఎయిమ్స్ చేపట్టినపరిశోధనలో 78 శాతం కచ్చితత్వం నమోదు



ఒకరు చెబుతున్నది నిజమో లేక అబద్ధమో లై డిటెక్టర్ టెస్ట్ చిటికెలో చెప్పేస్తుంది. నాడీ స్పందనలు, బీపీలో హెచ్చుతగ్గులు, శ్వాస తీసుకోవడంలో మార్పులను విశ్లేషించి ఆయా అంశాలను నిర్ధారిస్తుంది. అదే తరహాలో డిప్రెషన్‌ను కేవలం ఒక్క వాయిస్ శాంపిల్‌తో మెషీన్ లెర్నింగ్ చాలా వరకు కచ్చితత్వంతో తొలిదశలోనే గుర్తిస్తోంది! ఈ మేరకు సాగిన అధ్యయనాల్లో ఈ విషయం వెల్లడైంది. సంప్రదాయ చికిత్సా పద్ధతుల్లో డిప్రెషన్‌ను నిర్ధారించేందుకు వైద్యులు రోగులను కొన్ని ప్రశ్నలడిగి వారి భావోద్వేగ పరిస్థితులను అంచనా వేస్తుంటారు. అయితే ఈ పద్ధతిలో బాధితులు వారంతట వారుగా ముందుకొస్తే తప్ప వైద్య సాయం చేసేందుకు వీలు ఉండదు. దీనివల్ల చాలా సందర్భాల్లో బాధితులకు వైద్య సహాయం ఆలస్యం అవుతోంది. కానీ శాస్త్రవేత్తలు ఈ సమస్యను అధిగమించేందుకు ఏఐ సాంకేతికతను తెరపైకి తెచ్చారు. కుంగుబాటుకు గురైన వారి స్వరంలో హెచ్చుతగ్గులను మెషీన్ లెర్నింగ్ అల్గోరిథంల సాయంతో విశ్లేషిస్తున్నారు. కేవలం వాట్సాప్ ఆడియో ఫైల్స్‌ను విశ్లేషించడం ద్వారా డిప్రెషన్ బాధితుల లక్షణాలను 70 శాతం నుంచి 96 శాతం వరకు కచ్చితత్వంతో మెషీన్ లెర్నింగ్ టూల్స్ గుర్తిస్తున్నట్లు ప్రయోగాత్మకంగా నిరూపిస్తున్నారు. 25--30 సెకన్ల ఆడియో ఫైల్‌లోని స్వరంలో హెచ్చుతగ్గులు, వాల్యూమ్, స్పీచ్ రేట్ వంటి శబ్ద లక్షణాలను విశ్లేషించడం ద్వారా ఆయా వ్యక్తుల మనోవ్యథను మెషీన్ లెర్నింగ్ మోడల్స్ గుర్తిస్తున్నట్లు చెబుతున్నారు.

### ఎయిమ్స్‌పరిశోధన ఇలా...

డిప్రెషన్‌ను ముందుగానే గుర్తించడానికి స్పీచ్ అనాలిసిస్ ఒక ఆచరణాత్మక సాధనంగా ఉంటుందా అనే అంశాన్ని పరిశీలించేందుకు ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) పరిశోధన నిర్వహించింది. ఇందులో భాగంగా పరిశోధకులు 423 మంది వాలంటీర్ల నుంచి (ప్రధానంగా 18--25 సంవత్సరాల ఏళ్ల వారు) సంతోషం, బాధలో ఉన్నప్పుడు మాట్లాడిన స్వర నమూనాలను సేకరించి విశ్లేషించారు. ఈ ప్రయోగంలో పాల్గొన్న వాలంటీర్లు వారి క్లినికల్ మానసిక ఆరోగ్య స్థితిని నిర్ధారించుకోవడానికి ప్రామాణిక మానసిక పరీక్షలను కూడా చేయించుకున్నారు. ఈ అధ్యయనంలో వారి స్వరం, స్వర స్థాయి, స్వర శక్తితో సహా వాక్పటిమ, ఉచ్ఛారణ, ఇతర గుర్తులపై పరిశోధకులు దృష్టి సారించారు. దీనిప్రకారం నిరాశతో మాట్లాడిన సందర్భాల్లో వాక్పటిమ, భావోద్వేగ స్వరం, తక్కువ స్వర స్థాయిలను గమనించారు. అలాగే వాయిస్ విశ్లేషణను క్లినికల్ డేటాతో పోల్చినప్పుడు నమూనా నాణ్యతను బట్టి మెషీన్ లెర్నింగ్ మోడల్స్‌దాదాపు 60 శాతం నుంచి 78 శాతం కచ్చితత్వంతో నిస్పృహ లక్షణాలను సరిగ్గా అంచనా వేశాయని గుర్తించారు.

### వాయిస్ నోట్స్ ద్వారా...

పీఎల్‌వోఎస్ మెంటల్ హెల్త్‌లో ప్రచురితమైన మరో నివేదిక ప్రకారం బ్రెజిల్‌కు చెందిన మానసిక వైద్య పరిశోధకుడు విక్టర్ ఒటాని నేతృత్వంలోని పరిశోధకులు... డిప్రెసివ్ డిజార్డర్ లక్షణాలు ఉన్న, అవి లేని వ్యక్తులను వేరు చేయడంలో మెషీన్ లెర్నింగ్ మోడళ్లు సహాయపడతాయా అని పరీక్షించారు. ఈ అధ్యయనంలో పాల్గొన్న వారి నుంచి స్వల్ప వ్యవధిగల వాట్సాప్ వాయిస్ సందేశాలను రికార్డ్ చేశారు. ఆ ఆడియో క్లిప్‌ల నుంచి సేకరించిన శబ్ద లక్షణాలపై ఏడు వేర్వేరు మెషీన్ లెర్నింగ్ నమూనాలు, ప్రామాణిక క్లినికల్ ఇంటర్వ్యూలను ఉపయోగించి కుంగుబాటును నిర్ధారించారు. దీని ప్రకారం ఏఐ నమూనాలు మహిళల్లో 91.67 శాతం వరకు, పురుషులలో 80 శాతం వరకు కచ్చితత్వంతో కుంగుబాటును గుర్తించాయి.

### ఇతర ప్రపంచ అధ్యయనాలు ఏమి చెబుతున్నాయి...

ది యానల్స్ ఆఫ్ ఫ్యామిలీ మెడిసిన్‌లో ప్రచురితమైన మరో అధ్యయనం మాటలు, స్పందనల్లోని నిరాశను గుర్తించడానికి ఏఐ--ఆధారిత వాయిస్ బయోమార్కర్ సాధనాన్ని మూల్యాంకనం చేసింది. మెషీన్ లెర్నింగ్ సాధనం 70 శాతం కంటే ఎక్కువ కేసుల్లో ఆడియో ఫైల్‌ను సమర్పించిన 25 సెకన్లలోనే మోస్తరు నుంచి తీవ్ర నిరాశలో ఉన్న బాధితుల స్వరాలను గుర్తించింది. యూఎస్, కెనడాలోని దాదాపు 15,000 మంది వయోజనుల నుంచి సేకరించిన వాయిస్ రికార్డింగ్‌లను పరిశోధకులు విశ్లేషించి అల్గోరిథం ఇచ్చిన ఫలితాలను ప్రామాణిక డిప్రెషన్ ప్రశ్నపత్రాలతో పోల్చినప్పుడు ఈ మేరకు ఫలితాలు వచ్చాయి. అయితే ఈ విధానం క్లినికల్ డయాగ్నోసిస్‌కు ఏమాత్రం ప్రత్యామ్నాయం కాదని పరిశోధకులు స్పష్టం చేశారు.

# వందలసార్లు చార్జ్ చేసినా... అస్సలు తగ్గని సామర్థ్యం!

## జింక్ అయాన్ బ్యాటరీ ఆవిష్కరణ

## నీటి ఆధారిత మూలకాలతో తయారీ



మనం ప్రస్తుతం వాడుతున్న బ్యాటరీలన్నీ మండే స్వభావమున్న రసాయనాలతో తయారు చేసినవే. వాటికి పూర్తి భిన్నంగా నీటి ఆధారిత అణువులతో రూపొందిన వినూత్న జింక్ అయాన్ బ్యాటరీని సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మెటీరియల్స్ (సీఈఎన్ఎస్) పరిశోధకులు అభివృద్ధి చేశారు. దీంతో పునరుద్వాతక ఇంధన నిల్వ మరింత భద్రంగా, చవగ్గా, విశ్వసనీయంగా మారనుంది. ఈ విధానంలో తయారైన జింక్ అయాన్ బ్యాటరీని 500 సార్లు చార్జ్ చేసి వాడాక కూడా అచ్చం కొత్తదాని మాదిరిగా ఏకంగా 98 శాతం సామర్థ్యంతో పని చేస్తోందని పరిశోధకులు వెల్లడించారు! సౌర ఫలకాలు, విండ్ టర్బైన్ల నుంచి తయారైన విద్యుత్‌ను నిల్వచేసేందుకు దోహదపడే జింక్ భూమిపై చవగ్గా, సులభంగా, విస్తారంగా లభిస్తుంది. బ్యాటరీలో జింక్ ఒకవైపు పొరగా పనికొస్తుంది. మరోవైపు క్యాథోడ్‌గా ఏ మూలకాన్ని వాడాలనేది ఇన్నాళ్లూ సమస్యగానే మిగిలిపోయింది. ఈ సవాలుకు మాలిబ్డినం డైసలై?పడ్‌తో సీఈఎన్ఎస్ శాస్త్రవేత్తలు పరిష్కారం చూపారు. మాలిబ్డినం, సల్ఫర్‌లతో దాన్ని తయారుచేశారు. సల్ఫర్ నుంచి అత్యంత పల్చటి పొరలను అభివృద్ధి చేశారు. అవి శక్తిని నిల్వ చేసుకోవడమే గాక నిరంతరాయంగా సరఫరా కూడా చేయగలవని నిరూపించారు. నియంత్రిత వేడి వ్యవస్థ విధానం ద్వారా దీన్ని సుసాధ్యంచేశారు. దీంతో బ్యాటరీని చార్జ్ చేసినప్పుడు శక్తి సులభంగా లోపలికి వెళ్లడమే గాక అంతే సులభంగా డిశ్చార్జ్ అవుతోంది. భద్రమైన, అత్యంత సుస్థిరమైన ఆపరేటింగ్ పరిమితి అయిన 0.2--1.3 ఓల్ట్ స్థాయిని శాస్త్రవేత్తలు సాధించారు. తద్వారా బ్యాటరీ పాడవకుండా వందలసార్లు చార్జ్ చేసుకుని వాడుకోవచ్చు. చార్జింగ్ అనంతరం వాడే క్రమంలో కేవలం 0.3 శాతం శక్తి మాత్రమే వృథాగా పోతోంది. మిగతాదంతా బ్యాటరీలోనే నిల్వ ఉంటోంది. ఇలా 99.7 శాతం 'కౌలంబిక్ ఎఫీషియెన్సీ' సాధించడం విశేషం. ఈ కాయిన్--సెల్ నమూనా బ్యాటరీని ఎల్‌సీడీ టైమర్‌కు చార్జింగ్ పెట్టడం ద్వారా వాణిజ్య స్థాయిలో విజయవంతంగా పరీక్షించారు. ఈ పరిశోధన వివరాలు అమెరికా కెమికల్ సొసైటీ 'ఎనర్జీ అండ్ ఫ్యూయల్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

## షాక్..అధికారులపై వీధి కుక్కల్ని వదిలిన బాధితులు



ముంబై: ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన ఆందోళనకారులు వినూత్నంగా నిరసన తెలిపారు. అధికారుల మొండి వైఖరికి నిరసనగా ఏకంగా వీధి కుక్కలను పట్టుకెళ్లి ప్రభుత్వ కార్యాలయంలోని అధికారుల టేబుల్‌పైనే వదిలారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మహారాష్ట్రలోని నాసిక్‌లో వీధి కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై బాధితులు ఎన్నోసార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో సహనం కోల్పోయిన ప్రతిపక్ష శివసేన విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు విక్రమ్ వినూత్న రీతిలో నిరసనకు దిగారు. ఇందులో భాగంగా నిప్పహాడ్ నగర్ పంచాయతీ ఆఫీస్ చీఫ్ ఆఫీసర్ ధరేజ్ కార్యాలయానికి వెళ్లారు. ఆయన ఆఫీస్ గదిలో ఉండగానే లోపలికి ప్రవేశించి, అధికారుల టేబుళ్లు కుర్చీలపై ఆ కుక్కలను వదిలిపెట్టారు. అధికారులకు సమస్య తీవ్రతను కళ్లకు కట్టేందుకే తాము ఈ పద్ధతిని ఎంచుకున్నామని ఆందోళనకారులు తెలిపారు. కార్యాలయంలో కుక్కలు తిరుగుతుండటంతో అధికారులు, సిబ్బంది కొద్దిసేపు బెంబేలెత్తిపోయారు. ఈ వినూత్న నిరసన కార్యక్రమం ప్రస్తుతం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.ం

## వైఎస్ జగన్‌ను కలిసిన నిరుద్యోగులు



తాడేపల్లి: గ్రూప్-1, గ్రూప్-2 అభ్యర్థుల వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ పలువురు నిరుద్యోగులు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్ జగన్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ.. ఫేజ్-2 జాబ్ క్యాలెండర్‌లో ప్రభుత్వం ఇచ్చిన రెండేళ్ల వయో సడలింపు సరిపోదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రెగ్యులర్‌గా నోటిఫికేషన్లు రాకపోవడం వల్లే వయోపరిమితి దాటిపోయి లక్షలాది మంది యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నామని ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఉన్న 44 ఏళ్ల వయోపరిమితిని వన్‌టైమ్ సడలింపు కింద 47 ఏళ్లకు పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకునేలా చొరవ చూపాలని కోరారు. నిరుద్యోగుల సమస్యలు, విజ్ఞప్తులపై వైఎస్ జగన్ సానుకూలంగా స్పందించారు.

## ఆ జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరిక



అమరావతి: పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరికను ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ జారీ చేసింది. అల్లూరి, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ అయ్యింది. ఆయా జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వెల్లడించింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, గుంటూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో తేలికపాటి వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. 40-60 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలపై ప్రస్తుతం కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈనెల 19 నాటికి ఉత్తర అండమాన్ ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత మూడు, నాలుగు రోజుల్లో ఇది బలపడి దక్షిణ ఒడిస్సా--ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో వచ్చే వారం కోస్తాంధ్రలో వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. గురువారం అల్లూరి సీతారామరాజు, పోలవరం, కృష్ణా, గుంటూరు, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈదురుగాలులు కూడా వీస్తాయని తెలిపింది. ఇదిలావుండగా బుధవారం కాకినాడ జిల్లా రౌతులపూడిలో 6.8 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అనకాపల్లి జిల్లా మర్రిపాలెంలో 5.4, కాకినాడ జిల్లా డి.పోలవరంలో 4.8, కాకినాడ జిల్ల కోనపాపపేట 4.6, విశాఖ జిల్లా అక్కిరెడ్డిపాలెంలో 4.5, అనకాపల్లిలో 4.4, పాయకరావుపేటలో 4.3 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. మరోవైపు పలుచోట్ల ఎండల తీవ్రత కొనసాగింది. పగటిపూటి వేసవిని తలపించేలా ఎండలు మండాయి.

## కేసీఆర్ ఫాం హౌస్‌కు రెవెన్యూ అధికారులు.. అసలేం జరగనుంది?



సిద్దిపేట: ఎర్రవల్లిలోని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ వేగవంతమైంది. ఇందులో భాగంగా మరికాసేపట్లో రెవెన్యూ అధికారులు ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్‌ను సందర్శించనున్నారు. ఈ విచారణ నేపథ్యంలో కేసీఆర్‌కు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మర్కుక్ రెవెన్యూ కార్యాలయంలో అధికారులు సంబంధిత ఫైళ్లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కేసీఆర్ ఫాంహౌస్ భూములపై సీఎం రేవంత్ రెడ్డి నిన్న విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సిద్దిపేట కలెక్టర్ హైమావతి అధికారులతో సమావేశమై ఫాంహౌస్ భూములపై సమీక్ష నిర్వహించారు. మరోవైపు, శుక్రవారం సిద్దిపేటలో కాంగ్రెస్ ఎంపీలు పర్యటించనున్నారు. కబ్జా ఆరోపణలున్న భూమలను వారు పరిశీలించడంతో పాటు, రెవెన్యూ అధికారులతో సమావేశమై ప్రస్తుత పరిస్థితిపై చర్చించనున్నారు. ఈ పరిణామాలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# అంతరిక్ష యుద్ధానికి మనం సిద్ధమా?

అంతరిక్షంలో ఆయుధం ఉందన్న అమెరికా ప్రకటన ఇప్పుడు సర్వత్రా ప్రకంపనలు సృష్టిస్తోంది. భవిష్యత్తులో యుద్ధం నేలపై నుంచి కాకుండా అంతరిక్షంలోనే మొదలైతే... ఉపగ్రహాలే లక్ష్యంగా సాగితే తట్టుకోవడం ఎలా అన్న ప్రశ్న పలు దేశాల్లో మొదలైంది. రష్యా, చైనా లాంటి దేశాలు అంతరిక్ష యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు తగిన సాధన సంపత్తిని సమకూర్చుకున్నట్లు వార్తలు వస్తుండగా.... అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో ఉన్న భారత్ పరిస్థితి ఏమిటి? ఉపగ్రహాలను కూల్చే సత్తా మనకుందా? ఉంటే.. అమెరికా మాదిరిగానే మనమూ అంతరిక్షంలో మనదైన అస్త్రాన్ని సిద్ధంగా ఉంచగలమా? ఆసక్తికరమైన ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవిగో... ఉపగ్రహాలను కూల్చేయగల సత్తా భారత్‌కు ఇప్పుడు కాదు... ఏడేళ్ల క్రితం అంటే 2019లోనే సమకూరింది. 'మిషన్ శక్తి'పేరుతో ఈ ఉపగ్రహ విధ్వంసక ఆయుధ వ్యవస్థను భారత్ పరీక్షించింది. అగ్రరాజ్యాలు అమెరికా, ఒకప్పటి సోవియట్ యూనియన్‌ల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జోరుగా సాగుతున్న కాలంలో పురుడుపోసుకున్న ఈ ఉపగ్రహ విధ్వంసక ఆయుధాల ఆలోచన ఆ తరువాత బహుముఖంగా విస్తరించింది. అమెరికా 1985లోనే ఎఫ్--15 యుద్ధ విమానం ద్వారా 11.6 కిలోమీటర్ల ఎత్తుకు ఎగసి అక్కడి నుంచి ఏఎస్ఎం--135 క్షిపణిని ప్రయోగించింది. ఈ క్షిపణి 555 కిలోమీటర్ల ఎత్తులో తిరుగుతున్న శాస్త్రీయ ఉపగ్రహం ఒకదాన్ని ధ్వంసం చేసింది కూడా. ఇలా క్షిపణుల సాయంతో ఉపగ్రహాలను ధ్వంసం చేయగల వ్యవస్థలను కైనెటిక్ డైరెక్ట్ అసెంట్ ఏశాట్‌లని పిలుస్తారు. నేల, సముద్రం, గాల్లోంచి కూడా ప్రయోగించగలగడం వీటి ప్రత్యేకత. కక్ష్యలో తిరుగుతున్న ఉపగ్రహాన్ని గుర్తించేందుకు, కచ్చితంగా దాన్ని బలంగా ఢీకొనేందుకు శక్తిమంతమైన రాడార్లు, ఆప్టికల్ సెన్సర్లను ఉపయోగిస్తారు. ఎక్కడో వందల కిలోమీటర్ల





దూరంలో కంటికి కనిపించని, నిత్యం కదులుతూ ఉండే ఉపగ్రహాలను గుర్తించడం, క్షిపణులతో ఢీకొట్టడం అంతా చాలా సంక్లిష్టమైన వ్యవహారం. అందుకే డబ్బు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న దేశాలు మాత్రమే ఈ వ్యవస్థలను అభివృద్ధి చేయగలిగాయి. 1985లో అమెరికా మొట్టమొదటిసారి ఈ రకమైన వ్యవస్థలను ప్రయోగించి విజయం సాధిస్తే చైనాకు 2007 వరకూ సాధ్యపడలేదు. రష్యా 2021లో కాస్మోస్1408 ఉపగ్రహాన్ని ధ్వంసం చేసి తనకూ ఏశాట్‌లు ఉన్నాయని ప్రకటించుకుంది.

### మన పరిస్థితి ఏమిటి?

ముందుగా చెప్పుకున్నట్లు మిషన్ శక్తితో మనకు ఉపగ్రహాలను కూల్చేయగల సామర్థ్యం సమకూరింది. ఈ సత్తా కలిగిన నాలుగవ దేశంగా అవతరించింది. మిషన్ శక్తిలో భాగంగా రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) పృథ్వీ క్షిపణికి కొన్ని మార్పులు చేసి ప్రయోగించింది. 2019 మార్చి 27న ఒడిశాలోని అబ్దుల్ కలామ్ దీవి నుంచి నింగికి ఎగసిన ఈ మూడు దశల పృథ్వీ క్షిపణి అంతకు రెండు నెలల క్రితం ఇస్రో రాకెట్ ద్వారా భూమి లో ఎర్త్ ఆర్బిట్‌లోకి చేరిన మైక్రోశాట్--ఆర్ ఉపగ్రహాన్ని ఢీకొని నాశనం చేసింది. నేరుగా ఢీకొట్టడం ద్వారా మాత్రమే పృథ్వీ క్షిపణి ఉపగ్రహాన్ని నాశనం చేయడం గుర్తించాల్సిన విషయం. అంటే.. క్షిపణిలో ఎలాంటి పేలుడు సామగ్రిని వాడలేదన్నమాట. ప్రయోగం తరువాత జరిపిన పరిశీలనల్లో క్షిపణి ఉపగ్రహాన్ని ధ్వంసం చేయడంలో విజయవంతమైందని స్పష్టంగా తెలిసింది. దీనర్థం అంతరిక్షంలో తిరిగే ఉపగ్రహాలను గుర్తించి.. దాని దారిని పరిశీలిస్తూ... అడ్డుకుని పేల్చేయగల సత్తా భారత్‌కు ఉందీ అని!!! ఇప్పుడు పృథ్వీ క్షిపణిలో పేలుడు పదార్థం ఉందని ఒక్కసారి ఊహించుకోండి...

# మధుమేహానికి బ్యాక్టీరియాతో చెక్?

## ఈ-కోలీతో చైనా శాస్త్రవేత్తల ప్రయోగాలు మానవ ప్రయోగాల తర్వాతే అందుబాటులోకి

మన పేవుల్లో ఉండే కోటానుకోట్ల బ్యాక్టీరియా రకాల్లో ఈ--కోలీ ఒకటి. తిన్న ఆహారం జీర్ణమయ్యేందుకు సాయపడుతుంది. కొన్ని రకాలతో ఆరోగ్య సమస్యలూ వస్తాయి. అలాంటి బ్యాక్టీరియాతో టైప్--2 మధుమేహానికి చికిత్స కూడా అందించవచ్చు అంటున్నారు శాస్త్రవేత్తలు! ప్రీ క్లినికల్ ట్రయల్స్ దాటుకుని జంతు ప్రయోగాల దశకు చేరిన ఈ ఆసక్తికర పరిశోధన వివరాలు.. భారతదేశం ప్రపంచ మధుమేహ రాజధాని అంటూంటారు. కనీసం పది కోట్ల మంది ఈ జీర్ణక్రియ సమస్యతో బాధపడుతున్నారని అంచనా. ప్రపంచం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఈ సంఖ్య ఇంతకంటే ఎక్కువ. రోజూ మందులేసుకోవడం, అవి చాలకపోతే ఇన్సులిన్ ఇంజెక్షన్లు... వీటితో వచ్చే సైడ్ ఎఫెక్ట్‌లు ఎవరికైనా భరించలేని వేదనే. అందుకే మధుమేహానికి మెరుగైన చికిత్స కోసం ప్రపంచవ్యాప్తంగా ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. తాజాగా చైనాలోని ఈస్ట్ చైనా నార్మల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఈ వ్యాధికి ఒక వినూత్నమైన పరిష్కారాన్ని సూచించారు. గ్లూకోజును పసిగట్టే జన్యు రిసెప్టర్లను ఈ--కోలీ బ్యాక్టీరియాలోకి ప్రవేశపెట్టారు. చక్కెర నిర్దిష్ట స్థాయి కంటే ఎక్కువైతే చాలు... ఈ బ్యాక్టీరియా జీఎల్‌పీ--1 హార్మోన్‌ను విడుదల చేస్తుంది. ఇంకోలా చెప్పాలంటే.. ఈ బ్యాక్టీరియా కారణంగా ఊబకాయాన్ని తగ్గించుకునేందుకు వాడే ఒజెంపిక్‌తోపాటు సెమాగ్లూటైడ్ వంటి మందులు శరీరంలోనే తయారై



విడుదలవుతాయన్నమాట.

### ఇదీ సమస్య...

శరీరంలోని రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగితే ఇన్సులిన్ విడుదల చేయమని కాలేయానికి సందేశాలు వెళతాయి. ఈ ఇన్సులిన్ కాస్తా గ్లూకోజును మన కణాల తలుపులు తెరిచి గ్లూకోజు లోపలికి చొచ్చుకెళ్లేందుకు సాయపడతాయి. తగినంత గ్లూకోజు కణాల్లోకి చేరిన తరువాత ఇన్సులిన్ విడుదల కూడా తగ్గిపోతుంది. దీంతో కాలేయం అవసరాలకు తగ్గట్టు మళ్లీ చక్కెర తయారు చేసి రక్తంలోకి వదులుతూంటుంది. అయితే మధుమేహం ఉన్నవారిలో ఈ వ్యవస్థ సరిగ్గా పనిచేయదు. కణాలు ఇన్సులిన్‌కు స్పందించడం మానేస్తాయి. ఫలితంగా చక్కెర రక్తంలోనే ఉండిపోతుంది.

సెమాగ్లూటైడ్ వంటి మందులు ఇన్సులిన్ స్థాయిలను పెంచి గ్లూకోజు ఖర్చయ్యేందుకు సాయపడతాయి. ఈస్ట్ చైనా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఈ--కోలీ బ్యాక్టీరియానే రక్తంలోని గ్లూకోజు స్థాయిలను బట్టి జీఎల్‌పీ--1 హార్మోన్ విడుదల చేసేలా చేశారు. అవసరమైనప్పుడు మాత్రమే ఇన్సులిన్ విడుదల అవుతూండటం వల్ల సైడ్ ఎఫెక్ట్‌లు ఉండే అవకాశాలు తక్కువ. మధుమేహం ఉన్న కొన్ని రకాల కోతులు, ఎలుకలపై ఇప్పటికే తాము ఈ బ్యాక్టీరియాను ప్రయోగించామని, మంచి ఫలితాలే వచ్చాయని శాస్త్రవేత్తలు తెలిపారు. హానికర ప్రభావాలు కూడా లేనట్లు స్పష్టమైనట్లు చెప్పారు. మానవ ప్రయోగాలు కూడా నిర్వహించి సత్ఫలితాలు సాధిస్తే ఈ బ్యాక్టీరియా చికిత్స టైప్--2 మధుమేహ బాధితులకు వరం కాగలదనడంలో సందేహం లేదు.

# ఐపీవోలకు గ్రే మార్కెట్ జోష్

కొద్ది రోజులుగా సెకండరీ మార్కెట్లు కన్సాలిడేషన్ బాటలో సాగుతుంటే.. మరోపక్క ప్రైమరీ మార్కెట్లు పలు ఇష్యూలతో సందడి చేస్తున్నాయి. ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందనను అందుకోవడంతోపాటు.. లాభాల లిస్టింగ్‌తో ఐపీవో మార్కెట్లో జోష్ పెంచుతున్నాయి. ఫలితంగా కొత్త ఇష్యూలకు గ్రే(అనధికార అన్‌లిస్టెడ్) మార్కెట్లో ప్రీమియం పెరుగుతోంది. వెరసి ఇన్వెస్టర్లకు బస్ మిస్సవుతున్నామన్న ఆందోళన(ఫోమో) పెరిగి దరఖాస్తు చేసేందుకు క్యూ కడుతున్నారు. తాజాగా లిస్టయిన షిప్‌రాకెట్ ఇష్యూ ధర రూ. 97కాగా.. రూ. 143 వద్ద నిలిచింది. రూ. 285 ధరతో పోలిస్తే బెహరీలాల్ ఇంజనీరింగ్ రూ. 503 వద్ద స్థిరపడింది. ఇక ప్రస్తుతం మిల్కీ మిస్ట్ డెయిరీ(రూ. 140) తాజాగా 10 శాతం అప్పర్ సర్క్యూట్ తాకి రూ. 200 వద్ద ఫ్రీజయ్యింది. ఈ బాటలో మాల్బియో(రూ. 807) రూ. 1,177కు ఎగసి రూ.1,037 వద్ద ముగిసింది. ధూత్ ట్రాన్స్‌మిషన్(రూ. 871) రూ. 1,404 వద్ద, టెక్నోక్రాఫ్ట్(రూ. 212) రూ. 315 వద్ద, ఎంపీ ఎలక్ట్రోసిస్టమ్స్(రూ. 425) రూ. 570 వద్ద ముగిశాయి.

అనధికార ప్రీమియం...

ఇటీవల పలు కంపెనీలు లాభాలతో లిస్టవుతుండటంతో ఐపీవోకు వచ్చే కంపెనీల షేర్లు ముందుగా ట్రేడయ్యే అనధికార(గ్రే) మార్కెట్లో ప్రీమియం పలుకుతున్నాయి. ఫలితంగా కొత్త ఇష్యూలకు చిన్న ఇన్వెస్టర్లు క్యూ కడుతున్నారు. దీంతో షిప్‌రాకెట్‌కు రిటైలర్ల విభాగంలో 46 రెట్లు, బెహరీ లాల్‌కు 53 రెట్లు అధికంగా స్పందన లభించింది. ఈ బాటలో ఆగ్మంట్, టెంప్సన్స్, సన్‌షైన్ పిక్చర్స్, స్కైవేస్ ఎయిర్, లలితా జ్యువెలరీ ఇష్యూలకు గ్రే మార్కెట్లో ప్రీమియం ధర పలుకుతోంది.

ఐపీవో వేవ్...

రూ. 2,600 కోట్ల సమీకరణ లక్ష్యంగా హారిజన్ ఇండస్ట్రియల్ పార్క్స్, రూ. 1,700 కోట్ల సమీకరణ లక్ష్యంతో లలితా జ్యువెలరీ ఐపీఓలు బుధవారం(19న) ముగిశాయి. ఈ బాటలో నేడు(గురువారం) షేరుకి రూ. 88--93 ధరల శ్రేణితో ఆభరణ వర్తక సంస్థ శంకేష్ జ్యువెలర్స్, రూ. 342--360 ధరల శ్రేణితో టీవీ ప్రొడక్షన్ సంస్థ సన్‌షైన్ పిక్చర్స్ ఐపీవోలు ముగియనున్నాయి.

మరో 4 కంపెనీలు...

గజా క్యాపిటల్ బ్రాండ్‌తో కార్యకలాపాలు నిర్వహిస్తున్న గజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ ఐపీవో బుధవారం(19న) ప్రారంభమైంది. ఇందుకు ధరల శ్రేణి షేరుకి రూ. 152--160కాగా.. తద్వారా రూ. 550 కోట్లు అందుకునే యోచనలో ఉంది. టెంప్సన్స్ ఇన్‌స్ట్రుమెంట్స్(ఇండియా) ఐపీవో నేడు(20న) ప్రారంభంకానుంది. రూ. 825 కోట్ల సమీకరణ కోసం గోల్డ్ అండ్ సిల్వర్ ప్లాట్‌ఫామ్.. ఆగ్మంట్ ఎంటర్‌ప్రైజెస్ రేపు(21న) పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ బాటలో సోమవారం(24న) లాజిస్టిక్స్ కంపెనీ స్కైవేస్ ఎయిర్ సర?వసెస్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. తద్వారా రూ.





583 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. గత వారం ఐదు కంపెనీలు ఐపీవోలు చేపట్టగా.. ఈ నెల మొదట్లో మరో మూడు కంపెనీలు నిధుల సమీకరణ చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో 2026లో లిస్టింగ్ బాట పట్టిన కంపెనీల సంఖ్య 55కు చేరనుంది.

రెండు లిస్టింగ్‌లు సూపర్ హిట్..!

ఇటీవల పబ్లిక్ ఇష్యూ పూర్తి చేసుకొని, సెకండరీ మార్కెట్లోకి కొత్తగా అడుగుపెట్టిన రెండు కంపెనీల షేర్లు లిస్టింగ్ రోజే ఇన్వెస్టర్లకు లాభాల పంట పండించాయి. 'షిప్‌రాకెట్ లిమిటెడ్' షేరు ఇష్యూ ధరతో పోలిస్తే 48% పెరగ్గా, 'బెహరీలాల్ ఇంజనీరింగ్' షేరు సైతం ఏకంగా 76% ప్రీమియంతో మెరిసింది.

'షిప్ రాకెట్' మ్యాజిక్ ..!

టేమాసెక్, జొమాటోల పెట్టుబడులున్న ఈ--కామర్స్ ప్లాట్‌ఫామ్ 'షిప్‌రాకెట్' షేరు తొలి రోజే దూసుకెళ్లింది. ఇష్యూ ధర (రూ.97)తో పోలిస్తే బీఎస్‌ఈలో 34% ప్రీమియంతో రూ.130 వద్ద ప్రారంభమైంది. మార్కెట్ అనిశ?చతుల్లోనూ ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. చివరికి 48% లాభంతో రూ.143 గరిష్ట స్థాయి వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.10,441 కోట్లకు చేరింది.

బెహరీలాల్ భళా..!

ఐరన్, స్టీల్ తయారీ సంస్థ 'బెహరీలాల్ ఇంజనీరింగ్' షేరు మెప్పించింది. ఇష్యూ ధర (రూ.285)తో పోలిస్తే బీఎస్‌ఈలో 61% ప్రీమియంతో రూ.458 వద్ద లిస్టయ్యింది. ఒకానొక దశలో 89% శాతం ఎగబాకి రూ.537 గరిష్టాన్ని అందుకుంది. చివరకు 76% లాభంతో రూ.503 వద్ద ముగిసింది. ఈ కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.2,125.91 కోట్లుగా నమోదైంది.

లలితా జ్యువెలరీ.. భేష్

ఐపీవోకు 63 రెట్లు స్పందన

రూ. 190--201 ధరల శ్రేణిలో ఐపీవోకు వచ?చన లలితా జ్యువెలరీకి ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించింది. ఇష్యూ జ్యువెలరీ కంపెనీలలోనే అత్యధికంగా 63 రెట్లు సబ్?రస్కయిబ్ అయ్యింది. 6,27,61,403 షేర్లు ఆఫర్ చేయగా.. 395 కోట్ల షేర్లకుపైగా బిడ్స్ దాఖలయ్యాయి. క్విబ్ విభాగంలో 145 రెట్లు, సంపన్న వర్గాల నుంచి 74 రెట్లు, రిటైలర్ల నుంచి 12 రెట్లు చొప్పున దరఖాస్తులు లభించాయి. ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 1,700 కోట్లు సమీకరించింది. ఈ నెల 24న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్ట్‌కానుంది.

# పంట నష్ట పరిహారంలో అవకతవకలు - వ్యవసాయ అధికారులపై చర్యలు తీసుకోవాలి....జంపాన శ్రీనివాస్ గౌడ్,



తోట్లవల్లూరు శ్రీవార్త న్యూస్ తోట్లవల్లూరు మండలంలో 2024 సెప్టెంబర్ వరదల సమయంలో ఉద్యానవన పంటల నమోదులో, పంట నష్ట పరిహారం చెల్లింపుల్లో అవకతవకలకు పాల్పడిన వ్యవసాయ శాఖ అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ ఆర్టీఐ ప్రతినిధులు డిమాండ్ చేశారు.ఈ మేరకు రాష్ట్ర ఉపలోకాయుక్త జస్టిస్ పి. రజని, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి బి. రాజశేఖర్ కు ఫిర్యాదు చేసినట్లు ఆర్టీఐ కార్యకర్తలు జంపాన శ్రీనివాస్ గౌడ్, బేతపూడి నాగేశ్వరరావు, సిరివెళ్ల గౌరీ తెలిపారు.ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం వల్లూరుపాలెం గ్రామ వ్యవసాయ సహాయకుడు బి. రమణ, మండల వ్యవసాయ అధికారి గింజుపల్లి నాగేశ్వరరావు, పాములంక ఎం.పి.ఈ.ఓ, సాతేవల్లూరు వి.ఏ.ఈ. కె. మౌనిక తదితరులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపించారు.జి ఓ యం యస్ నెంబర్ 458, జి ఏ. సర్వీస్ డిపార్ట్మెంట్ 22-09-2009 ప్రకారం సంబంధిత అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. వల్లూరుపాలెం వ్యవసాయ సహాయకుడు బి. రమణను ఉద్యోగం నుండి తొలగించాలని, మండల వ్యవసాయ అధికారి గింజుపల్లి నాగేశ్వరరావుపై సీసీఏ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు వారు పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై ఉపలోకాయుక్త కేసు నెం. 385/2025/బి2లో విచారణ జరుగుతున్నట్లు ఫిర్యాదుదారులు తెలిపారు.

# రాఘవేంద్ర హైట్స్ లో వైభవంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు మహిళల విష్ణు సహస్రనామ పారాయణం




ఉయ్యూరు శ్రీ వార్త న్యూస్ఉయ్యూరులోని రాఘవేంద్ర హైట్స్ అపార్ట్మెంట్‌లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజైన బుధవారం వినాయకుని మండపం వద్ద మహిళా భక్తులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా అపార్ట్మెంట్‌లోని మహిళలందరూ పెద్ద ఎత్తున హాజరై భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. స్వామివారికి ప్రత్యేక అర్చనలు, ధూపదీప నైవేద్యాలు సమర్పించి తమ కుటుంబాలకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థించారు.ఆధ్యాత్మిక వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమంలో మహిళా భక్తుల నామస్మరణతో అపార్ట్మెంట్ ప్రాంగణం మారుమోగింది. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు

# విశ్వకర్మ జయంతి సందర్భంగా కలెక్టర్ డీకే బాలాజి పుష్పాంజలి



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో విశ్వకర్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళు లర్పించారు.విశ్వకర్మ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ శిల్పకళ, నిర్మాణ రంగం, సాంకేతిక నైపుణ్యాలతో సమాజ అభివృద్ధికి సేవలందిస్తున్న వృత్తి నిపుణులు, కార్మికులు, శిల్పులు, కళాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంప్రదాయంలో విశ్వకర్మను సృష్టికర్తగా, శిల్పకళకు ఆద్యుడిగా భావిస్తారని పేర్కొన్నారు.కార్యక్రమంలో డిఆర్ఓ కే శ్రీధర్ రెడ్డి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జి రమేష్, కుల సంఘ నాయకులు తదితరులు పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

# నిరుపేద బ్రాహ్మణులకు 15 కోట్ల రుణ సౌకర్యం గోర్తి శ్రీనివాస్ సేవలు చిరస్మరణీయం...గొర్రెపాటి గోపీచంద్



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉమ్మడి కృష్ణా జిల్లాలో నిరుపేద బ్రాహ్మణులకు ఆర్థికంగా బలపడేలా 15 కోట్ల రూపాయల రుణ సౌకర్యం కల్పించిన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ విజయవాడ బ్రాంచి మేనేజర్ గోర్తి శ్రీనివాస్ సేవలు చిరస్మరణీయమని ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ అన్నారు.మచిలీపట్నంలో గురువారం బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కార్యాలయంలో గోర్తి శ్రీనివాస్ ను బ్రాహ్మణులకు అందిస్తున్న సేవలకు గాను పలువురు బ్రాహ్మణులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ, ఉమ్మడి కృష్ణా జిల్లా మొత్తానికి విజయవాడ బ్రాంచి ఒక్కటే ఉండటం వలన మేనేజర్ గా



అర్హత కలిగిన నిరుపేద బ్రాహ్మణులను గుర్తించి, వారిని వ్యాపారాలు చేసే విధంగా ప్రోత్సహిస్తూ, నిరుపేద బ్రాహ్మణ కుటుంబాల్లో వెలుగులు నింపే విధంగా బాధ్యతగల అధికారిగా రుణ సౌకర్యం కల్పించి, తిరిగి రుణాలను రికవరీ చేసుకుంటూ సంస్థను బలోపేతం చేస్తూ నిరుపేద బ్రాహ్మణులకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా 41 కోట్ల రూపాయల టర్నోవర్ చేస్తూ, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి. ఫణి కుమార్ తో కలిసి రాజకీయాలకు అతీతంగా బ్రాహ్మణులందరినీ కలుపుకుంటూ ముందుకు వెళ్తున్న గోర్తి శ్రీనివాస్ సేవలను గుర్తించి సత్కరించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పి.వి. ఫణి కుమార్ తో పాటు మచిలీపట్నం బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు మోపర్తి సుబ్రహ్మణ్యం, పి.ఎస్.ఎస్.ఆర్. శర్మ, రెండుచింతల వెంకటరమణ, వడ్లమన్నాటి మారుతి దివాకర్, పిడుగు కృష్ణయ్య, నిమ్మగడ్డ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పొదుపు అలవాటును పెంపొందించాలి

## చిన్న మొత్తాల పొదుపుతో భవిష్యత్‌లో ఆర్థిక భద్రత.....జిల్లా కలెక్టర్ డీకే బాలాజి




మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పొదుపు అలవాటు, ఆర్థిక క్రమశిక్షణ, ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి సూచించారు.మచిలీపట్నం పోస్టల్ డివిజన్ ఆధ్వర్యంలో చిలకలపూడిలోని పాండురంగ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం పోస్టాఫీస్ రికరింగ్ డిపాజిట్ (ఆర్డీ) ఖాతాల పాస్‌బుక్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని విద్యార్థులకు ఆర్డీ ఖాతాల పాస్‌బుక్‌లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, చిన్న మొత్తంలో చేసే పొదుపు కూడా క్రమం తప్పకుండా కొనసాగిస్తే భవిష్యత్‌లో పెద్ద మొత్తంగా మారుతుందని తెలిపారు. ఒక రూపాయి, రెండు రూపాయలు అని చిన్నచూపు చూడకుండా పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఇప్పటికే బ్యాంకు ఖాతాలు తెరవడం ఆర్థిక సమ్మిళితంలో భాగంగా అభినందనీయమని, అయితే ఖాతా తెరవడం మాత్రమే సరిపోదని, అందులో క్రమం తప్పకుండా పొదుపు చేయడం కూడా ముఖ్యమని



స్పష్టం చేశారు.చిన్న వయసులోనే పొదుపు, పెట్టుబడులపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్‌లో ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఒకేసారి పెద్ద మొత్తాన్ని జమ చేయడం కంటే ప్రతిరోజూ లేదా క్రమం తప్పకుండా చిన్న మొత్తాలను పొదుపు చేయడం ద్వారా ఆర్థిక క్రమశిక్షణ అలవడుతుందని చెప్పారు.ఒక్క రూపాయి, రెండు రూపాయలు కలిసి పెద్ద మొత్తంగా మారినట్లే, ప్రతిరోజూ క్రమం తప్పకుండా చేసే చిన్న ప్రయత్నాలే భవిష్యత్ విజయానికి పునాది అని కలెక్టర్ తెలిపారు. పొదుపుతో పాటు సమయాన్ని కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.రోజువారీ జీవితంలో వృథా చేసే ఐదు, పది నిమిషాలను సద్వినియోగం చేసుకున్నా వ్యక్తిత్వ వికాసంలో ఎంతో మార్పు వస్తుందని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుతూ క్రమశిక్షణ, సమయపాలన, పొదుపు వంటి మంచి అలవాట్లను చిన్ననాటి నుంచే అలవరుచుకోవాలని ఆకాంక్షించారు.తపాలా శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, పాండురంగ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని ప్రారంభించగానే విద్యార్థులు, పాఠశాల సిబ్బంది నుంచి విశేష స్పందన లభించిందని, ఇప్పటివరకు 125 ఆర్డీ ఖాతాలు ప్రారంభించడం సంతోషకరమని తెలిపారు. విద్యార్థులు ఇప్పటి నుంచే పొదుపు అలవాటు చేసుకుంటే భవిష్యత్‌లో ఇతరులపై ఆధారపడకుండా ఆర్థిక క్రమశిక్షణతో ముందుకు సాగగలరని అన్నారు.కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి యువి సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి ఏడాది పూర్తి

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రాము సహకారం





కృష్ణాజిల్లా శ్రీ వార్త న్యూస్శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానానికి ధర్మకర్తల మండలి నియామకం జరిగి, దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం 17-09-2025న ప్రమాణ స్వీకారం చేసి నేటికి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్వాహకులు వివరించారు.ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా గుడివాడ నియోజకవర్గ శాసనసభ్యులు ~నిగండ్ల రాము హాజరయ్యారు.ధర్మకర్తల మండలి చైర్మన్ గా ఈడే వెంకట విష్ణు మోహన రావు (మోహన్), సభ్యులుగా శ్రీమతి తూము రాజ్యలక్ష్మి, శ్రీమతి గుడ్లవల్లేటి వాణి, శ్రీ ముగం ఆంజనేయులు, శ్రీ కళ్లేపల్లి సుగుణ శేఖర్, మన్నెం వీర నాగేంద్ర రావు,వడ్లమూడి రవీంద్ర బాబు, శ్రీమతి పెద్దిబోయిన శ్యామల దేవి, శ్రీమతి నూతలపాటి లక్ష్మీ పావని, శ్రీమతి ఊస్తేల కోటేశ్వరమ్మ, వీర వెంకట నాగ లీలా శేఖర్, ఎక్స్ అఫీషియో మెంబర్ గా రుద్రపాక శరత్ చంద్ర శివ సంతోష్ శర్మ ప్రమాణ స్వీకారం చేశారు.

### ఏడాదిలో జరిగిన అభివృద్ధి పనులు:

ధర్మకర్తల మండలి, కార్యనిర్వహణాధికారి మరియు దేవస్థానం సిబ్బంది సంయుక్తంగా ఈ ఏడాది కాలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు.గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆశీస్సులతో షాపింగ్ కాంప్లెక్స్-2 లో 14 షాపులు, షాపింగ్ కాంప్లెక్స్-3 లో 8 షాపుల నిర్మాణం, జల ప్రసాదానికి షెడ్డు దాతల సహాయ సహకారాలతో నిర్మాణం.చైర్మన్ సొంత సొమ్ముతో రావి చెట్టు చుట్టూ చపటా నిర్మాణం, కాళ్లు చేతులు శుభ్రపరచుకోవడానికి కుళాయిల ఏర్పాటు.కోటి రూపాయలు దేవస్థానం మరియు సిజిఎఫ్ నిధులతో కాలక్షేప మండపం నిర్మాణం జరుగుతోంది.ఆర్.డబ్ల్యూ.ఎస్. వారిచే 15 లక్షల రూపాయలతో ఆడ, మగ భక్తులకు మరుగుదొడ్ల నిర్మాణం జరుగుతోంది.ప్రతి శుక్రవారం 100 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని 7-8-2026న ఎమ్మెల్యే రాము గారి చేతుల మీదుగా ప్రారంభించి కొనసాగిస్తున్నారు.రాత్రి వేళల్లో ఆలయం కనులకు మిరుమిట్లు గొలిపేలా ప్రధాన ఆలయానికి, రోడ్డుపై విద్యుత్ దీపాలంకరణ, నిరంతరం వెలుగుతున్న ఓంకారం ఏర్పాటు.చైర్మన్ ప్రతి నిత్యం దేవాలయానికి వచ్చి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూసుకుంటున్నారని, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సహాయ సహకారాలతో, దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో దేవస్థానం చైర్మన్ శ్రీ ఈడే మోహన్ గారు, కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు మరియు ధర్మకర్తల మండలి సభ్యులు కలిసి అనేక అభివృద్ధి పనులు చేస్తున్నారని తెలిపారు.

# మచిలీపట్నంలో ఘనంగా విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలు వేడుకల్లో పాల్గొన్న బండి రామకృష్ణ



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ మచిలీపట్నంలో విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బంగారు కొట్ల లైన్ లోని కన్యకా పరమేశ్వరి రైస్ మిల్ ఎదురుగా శ్రీ కామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ వేడుకల్లో పాల్గొన్న బండి రామకృష్ణ మాట్లాడుతూ, స్వర్ణకారులు గత 35 సంవత్సరాలుగా కులమతాలకు అతీతంగా విశ్వకర్మ భగవానుడికి పూజలు నిర్వహించి అనంతరం వేలాది మందికి అన్నదానం చేస్తున్నారని పేర్కొన్నారు. సృష్టికి మూలమైన విశ్వకర్మ భగవానుడు సృష్టించిన ఈ సృష్టిలో మనందరం కలిసిమెలిసి జీవిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం అధికారికంగా విశ్వకర్మ జయంతి నిర్వహించాలని ఆదేశాలు



ఇవ్వడంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వైభవంగా నిర్వహించారని తెలిపారు.రాష్ట్ర స్వర్ణకార సంఘ కార్యదర్శి గడ్డంరాజు మాట్లాడుతూ, హిందూ పురాణాల ప్రకారం విశ్వకర్మ భగవానుడు సృష్టికి మూలపురుషుడు, దేవతల దివ్య శిల్పి అని, విశ్వకర్మ అనగా సమస్తాన్ని సృష్టించేవాడని అర్థమన్నారు. సత్యయుగంలో స్వర్గధామాన్ని, త్రేతాయుగంలో రావణుని కోసం బంగారు లంకను, ద్వాపరయుగంలో శ్రీకృష్ణుని కోసం ద్వారక నగరాన్ని, మహాభారతంలో పాండవుల కోసం ఇంద్రప్రస్థాన్ని నిర్మించారని, ఇంద్రుడి వజ్రాయుధం, శివుడి త్రిశూలం, విష్ణువు సుదర్శన చక్రం వంటి దివ్య ఆయుధాలను విశ్వకర్మ సృష్టించినట్లు వేదాలు చెబుతున్నాయని వివరించారు.శిల్పులు, వడ్రంగులు, కమ్మరివారు, స్వర్ణకారులు, ఇంజనీర్లందరూ విశ్వకర్మను కులదైవంగా ఆరాధిస్తారని, ప్రతి ఏటా భాద్రపద మాసం లేదా కన్యా సంక్రాంతి రోజున విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు.కామాక్షి స్వర్ణకార సంఘం అధ్యక్షులు మానేపల్లి దుర్గా మాట్లాడుతూ, మానేపల్లి ఈశ్వరచారి సిద్ధాంతి చే విశిష్ట పూజలు నిర్వహించి అన్న ప్రసాద వితరణ చేశామని, కార్యక్రమంలో పాల్గొన్న నగర ప్రముఖులను శాలువాతో సత్కరించి వేద ఆశీర్వచనం అందజేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్వర్ణకార సంఘ కార్యదర్శి గడ్డంరాజు, కామాక్షి స్వర్ణకార సంఘ అధ్యక్షులు మానేపల్లి దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి కసుకుర్తి వీర వెంకటేశ్వరరావు, వాసా బత్తుల శ్రీనివాసరావు, అబ్దుల్ వాజిద్, జేజి, మల్లికార్జునరావు, లోకేష్, రామారావు, నాగేశ్వరరావు, పాలకొల్లు నాగేశ్వరరావు, భవిరి అనిల్, గంగాధర్, సామేలు, కోటిలింగాచారి, బాకూరి సూరిబాబు, మల్లి, రాజేంద్ర ప్రసాద్, మానేపల్లి కృష్ణమోహన్, సయ్యద్ మహబూబ్, మహమ్మద్ షరీఫ్, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

Pulisher,Owner and Editor kureti satish, printed by Teja cards and stationery ground floor 26-25-2durgi vari veedhi,opp Inox theater Gandhi nagar Vijayawada ,Andra Pradesh 520003.PRGS Nembar: APTEL/26/A4813, Editor: kureti satish,cell number:9866640784,H. No:21-651a,near Suvarna Kalyana mandapam,parasupeta machilipatnam Krishna Distric, Andra Pradesh.521001